

3,14,984

ఎమ్మెల్సీ గ్రాడ్యుయేట్ మొత్తం ఓటర్లు

ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటర్ల సంఖ్య లెక్క తేలింది. మొత్తం 3,14,984 మంది ఓటర్లలో పురుషులు 1,83, 347, మహి ళలు 1,31,618 మంది ఉన్నారు. కొత్త జిల్లాల వారీగా చూస్తే పశ్చిమలో 70,052.. ఏలూరు జిల్లాలో 42,282 మంది ఉన్నారు. ఈ స్థానం విజయావకాశాలపై తెలుగుదేశం నిర్వహించిన సర్వేలో విజయం ఏకపక్షమేనని తేల్చి చెప్పాయి. ఈ గెలుపుపై కూటమి పార్టీలు ధీమా వ్యక్తం చేస్తున్నాయి. ఎమ్మెల్సీ ఎన్నికల సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం కల్పిస్తున్నట్లు రిటర్నింగ్ ఆఫీ సర్ కె.వెట్రిసెల్వి తెలిపారు. - 7లో

కునుకు కరువాయె !

- నిద్రలేమితో అనారోగ్య సమస్యలు
- సెల్‌ఫోన్‌లు, టీవీలకు బానిసలు
- పని ఒత్తిడి మరో కారణం

సండే ప్రత్యేక కథనం -6లో

జీబీఎస్ కలకలం..



జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రిలో జీబీఎస్ అనుమానిత కేసుల కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక ఐసోలేషన్ వార్డులో వైద్య సిబ్బంది

- చెన్నైకు బాలిక సీఎస్ఎఫ్ నమూనాలు
- జీబీఎస్ లక్షణాలున్న బాలిక వద్దకు డీఎంహెచ్‌వో, డీపీవో
- ప్రభుత్వ, ప్రైవేటు పీడియాట్రిక్స్ ఆస్పత్రుల్లో నిశిత పరిశీలన

ఏలూరు అర్బన్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): ఐదేళ్ల బాలికకు గులియన్ బారే సిండ్రోమ్ (జీబీఎస్) అనుమానిత లక్షణాలు కనబడడంతో అప్రమత్తమైన జిల్లా వైద్య ఆరోగ్య శాఖ క్షేత్రస్థాయిలో నిశిత పరిశీలనకు ఉపక్రమించింది. విజయవాడలోని ప్రభుత్వ పాత ఆసుపత్రి పీడియాట్రిక్స్ విభాగంలో వైద్యుల పర్యవేక్షణలో వున్న బాలిక ఆరోగ్య స్థితిగతులను తెలుసుకునేందుకు శనివారం డీఎంహెచ్‌వో డాక్టర్ మాలిని, ఆర్‌బీఎస్‌కే జిల్లా ప్రాజెక్టు ఆఫీసర్ (డీఎస్‌వో) డాక్టర్ నరేంద్రకృష్ణ, తదితరులు తరలి వెళ్లారు. ఇప్పటికే బాలిక నుంచి సేకరించిన సీఎస్ఎఫ్ నమూనాలను తుది నిర్ధారణ నిమిత్తం ల్యాబ్ పరీక్షల నిమిత్తం చెన్నైకు పంపించినట్టు డీఎం హెచ్‌వో, డీపీవో తెలిపారు. ల్యాబ్ పరీక్ష నివేదిక వచ్చిన తర్వాతే బాలికకు జీబీఎస్ సోకిందీ, లేనిదీ తుది నిర్ధారణ అవుతుందని వివరించారు. నివేదిక రావడానికి రెండువారాల వ్యవధి పట్టవచ్చన్నారు. ఆస్పత్రిలో బాలిక ఆరోగ్యవంతంగా ఉందని వివరించారు. కాగా చింతలపూడి మండలం యర్రగుంటపల్లిలో బాలిక నివసించే ప్రాంతంలో నలుగురి నుంచి మల పరీక్షల నిమిత్తం శాంపిల్స్‌ను సేకరించి ల్యాబ్ టెస్టులకు పంపామన్నారు. మరోవైపు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఏలూరు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి, జిల్లాలోని సీహెచ్‌సీలు, ప్రైవేటు ఆస్పత్రుల్లో పీడియాట్రిక్స్ విభాగాలకు వచ్చే చిన్నపిల్లల్లో ఎవరైనా కండరాల సమస్యలు, జీబీఎస్ అనుమానిత లక్షణాలతో వైద్యం నిమిత్తం వచ్చిఉంటే అటువంటి వారి వివరాలను పంపాలని సూచించినట్టు వైద్యఆరోగ్యశాఖవర్గాలు వెల్లడించాయి. దీనిపై డీఎంహెచ్‌వో డాక్టర్ మాలిని మాట్లాడుతూ అపరిశుభ్రకరమైన ఆహార పదార్థాలు, జంక్ ఫుడ్స్, కలుషిత నీరుకు దూరంగా ఉండాలని, వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం, ప్లాస్టిక్ వస్తువుల్లో ఆహార పదార్థాల నిల్వలు లేకుండా చూసుకోవడం, తదితర ముందస్తు జాగ్రత్తలపాటు, ఫిట్‌నెస్ కోసం వ్యాయామం వంటివి చేయడం వల్ల జీబీఎస్‌ను అడ్డుకోవచ్చన్నారు. ఇది అంటువ్యాధి కాదని, ఆందోళన చెందాల్సిన పని లేదన్నారు.

యర్రగుంటపల్లిలో ఇంటింటా సర్వే

చింతలపూడి : చింతలపూడి మండలం యర్రగుంటపల్లిలో ఐదేళ్ల బాలికలో గులియన్ బారే సిండ్రోమ్ (జీబీఎస్) లక్షణాలు కన్పించడంతో గ్రామంలో మూడు రోజులుగా ఇంటింటా సర్వే నిర్వహిస్తున్నట్టు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ నరేశ్ తెలిపారు. ఆ బాలికను విజయవాడకు చికిత్సకు తరలించామని, ఆమె నివాస పరిసరాల్లోని 50 గృహాల్లో సర్వే నిర్వహించగా ఎవరికీ ఎటువంటి లక్షణాలు కనిపించలేదన్నారు. గ్రామంలో ప్రత్యేక శిబిరం నిర్వ హించి శాంపిల్స్ తీసి పరీక్షలకు పంపినట్టు తెలిపారు. స్థానికులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు.

ఏరియా ఆస్పత్రిలో ప్రత్యేక ఐసోలేషన్ వార్డు

ఏలూరు : చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ ఆదేశాలతో జంగారెడ్డిగూడెం ఏరియా ఆస్పత్రిలో జీబీ సిండ్రోమ్ అనుమానిత కేసులకు ప్రత్యేక ఐసోలేషన్ వార్డును సిద్ధం చేసినట్టు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ బేబీ కమల శనివారం తెలిపారు. కండరాల బలహీనత, జ్వరం వంటి లక్షణాలున్న వ్యక్తులు ఏరియా ఆస్పత్రిలో సంప్రదించాలన్నారు. ప్రజలు కాచి చల్లార్చిన నీటిని తాగాలని, పరిసరాల పరిశుభ్రత పాటించాలని, బయటి ఆహార పదార్థాలను కొద్దిరోజులు దూరం పెట్టాలని, తరచూ చేతులను శుభ్రం చేసుకోవాలని ఆమె సూచించారు.



తాడేపల్లిగూడెం మండలం పెదతాడేపల్లిలో చనిపోయిన కోళ్లను పాతిపెడుతున్న సిబ్బంది

అంతా సేఫ్

ఎవరికీ బర్డ్ ఫ్లూ వైరస్ లక్షణాలు లేవు

బర్డ్ ఫ్లూపై అధికార యంత్రాంగం చురుగ్గా స్పందించడంతో ప్రజలు ఎవరికీ ఈ వైరస్ వ్యాపించలేదని ల్యాబ్ రిపోర్టులు తేల్చి చెబుతున్నాయి. బాదంపూడి రెడ్‌జోన్ పరిధిలోని ప్రజలకు ర్యాండమ్‌గా శ్వాబ్ నమూనాలు సేకరించి పరీక్షించగా ఎవరికీ వైరస్ సోకలేదు. మరోవైపు పశు సంవర్ధక శాఖ ముఖ్య కార్యదర్శి రాజశేఖర్ బాదంపూడి, వేల్పూరుల్లో పర్యటించి.. అధికారులతో సమీక్షించారు. కొల్లేరు పక్షులకు బర్డ్‌ఫ్లూ సోకే అవకాశాలు లేవని, అయినప్పటికీ నిఘా పెట్టినట్టు అటవీ శాఖ అధికారులు ప్రకటించారు. యలమంచిలి మండలం ఊటాట, తాడేపల్లిగూడెం మండలం పెదతాడేపల్లిల్లో శనివారం కొన్ని వేల కోళ్లు మృత్యువాత పడ్డాయి. వీటిని ఖననం చేశారు.

- వార్తలు.. మెయిన్, జిల్లా పేజీల్లో

'ఆంధ్రజ్యోతి' ఫోన్ ఇన్ కార్యక్రమానికి స్పందన

ఏలూరు టూటౌన్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): నగర పాలక సంస్థ కమిషనర్‌తో ఈనెల 11వ తేదీన నిర్వహించిన 'ఆంధ్రజ్యోతి ఫోన్ ఇన్' కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన సమస్యలు పరిష్కారం దిశగా కమిషనర్ భానుప్రతాప్ చర్యలు చేపట్టారు. ఆరోజు ఒక గంట వ్యవధిలో 35 మంది తమ సమస్యలను కమిషనర్‌కు ఏకరువు పెట్టారు. ప్రజా సమస్యలను సావధానంగా విన్న కమిషనర్ వారం రోజుల్లోగా పరిష్కరిస్తానని ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటున్నారు. ఆ మేరకు కొన్ని సమస్యలను నాలుగు రోజుల్లోపే పరిష్కరించారు. రాబోయే మూడు రోజుల్లో మిగిలిన సమస్యలన్నింటిని పరిష్కరించేందుకు కృషి చేస్తామని కమిషనర్ తెలిపారు. క్రాంతినగర్ రోడ్డును ఇంజనీరింగ్ సిబ్బంది ఎస్టిమేషన్ వేశారు. నిధులు సమకూరగానే రోడ్డు నిర్మిస్తామని తెలిపారు. పందుల యాజమానులతో మాట్లాడి ఊరు బయటకు పందులను తరలించేందుకు చర్యలు చేపడుతున్నారు.

కమిషనర్ దృష్టికి తీసుకొచ్చిన సమస్యల పరిష్కార దిశగా చర్యలు



- 30వ డివిజన్ మంచినీళ్ల తోటలో బ్రహ్మంగారి గుడి వద్ద రోడ్డు గుంతలు పడి అధ్వానంగా ఉండేది. ఆ రోడ్డుపై గుంతలను పూడ్చివేశారు.



- మీసాల అప్పన్నస్వామి వీధిలో టెంపుల్ వద్ద డ్రెయిన్‌లో మురుగు నిల్వ ఉండి దుర్వాసన వెదజల్లేది. స్థానికుల నుంచి అందిన ఫిర్యాదుతో నగరపాలక సంస్థ సిబ్బంది మురుగు డ్రెయిన్‌ను శుభ్రం చేశారు.



- అతిథి హోటల్ సమీపంలో హాస్పిటల్ వద్ద పైపులైన్ లీకేజీతో తాగునీరు వృథాగా పోతున్నట్టు అందిన ఫిర్యాదు మేరకు పైపులైన్లకు మరమ్మతులు చేసి లీకేజీని సరి చేశారు.



- 30వ డివిజన్ మోతేవారితోటలోని ఖాళీ స్థలాల్లో పిచ్చి మొక్కలతో దోమల బెడద పెరిగిందన్న ఫిర్యాదుపై అధికారులు స్పందించారు. దోమల నిర్మూలనకు స్ప్రేయింగ్, ఫాగింగ్ చేయించారు.



- క్రాంతినగర్‌లో అధ్వానంగా ఉన్న రోడ్లను ఇరువైపులా పారిశుధ్య సిబ్బంది శుభ్రం చేశారు. పిచ్చిమొక్కలను, చెత్తాచెదారాన్ని తొలగించారు.



- మోతేవారితోటలో కుక్కలు, పందుల బెడద ఎక్కువైందని, కుక్కలు రాత్రి వేళల్లో ప్రజలను కరుస్తున్నాయని ఫోన్ ఇన్ కార్యక్రమంలో ఫిర్యాదు చేయడంతో నగర పాలక అధికారులు స్పందించారు. ఇప్పటి వరకు 16 వీధి కుక్కలను పట్టుకుని వాటికి కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేశారు.

క్లస్టర్ సమావేశాలకు 6,700 మంది టీచర్ల హాజరు

ఏలూరు అర్బన్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : స్కూల్ కాంప్లెక్స్ సమావేశాల స్థానే ప్రభుత్వం కొత్తగా ఏర్పాటు చేసిన క్లస్టర్ల విధానంలో శనివారం తొలిసారిగా నిర్వహించిన ఉపాధ్యాయుల సమావేశాలపై మిశ్రమ స్పందన వచ్చింది. ఇప్పటివరకు మండలంలోని ప్రాథమిక, ఉన్నత పాఠశాలల టీచర్లకు వేర్వేరుగా రెండురోజులపాటు నిర్వహించిన కాంప్లెక్స్ సమావేశాలను పునర్వ్యవస్థీకరిస్తూ క్లస్టర్‌కు ట్యాగ్‌చేసిన పాఠశాలల ఉపాధ్యాయులందరినీ ఒకేచోటకు చేర్చి సమావేశాలను నిర్వహించే విధానానికి శ్రీకారం చుట్టారు. శనివారం జరిగిన మొదటి క్లస్టర్ సమావేశానికి జిల్లాలో 111 క్లస్టర్ల మీటింగ్‌లకు మొత్తం 7,127 మంది ఉపాధ్యాయులు హాజరు కావాల్సి ఉండగా 6,700 మంది హాజరయ్యారు. మిగతావారంతా వైద్య సెలవులపై ఉన్నట్టు తెలిసింది. కాగా పలుచోట్ల హాజరు నమోదులో సాంకేతిక సమస్యలు ఎదురయ్యాయి. మరోవైపు క్లస్టర్ సమావేశాలు ప్రాథమిక పాఠశాలల టీచర్ల వరకు విజయవంతమైనా, క్లస్టర్ పరిధిలో ఉండే రెండు లేదా మూడు హైస్కూళ్ల టీచర్లకు సబ్జెక్టుల వారీగా నిర్వహించిన సమావేశాలు సబ్జెక్టుకు కేవలం ఇద్దరు, ముగ్గురుతోనే సరిపెట్టాల్సి రావడంతో కాస్తా డల్‌గా కనిపించాయి. ఈ నేపథ్యంలో హైస్కూళ్ల వరకైనా క్లస్టర్ సమావేశాలను మండలస్థాయిలో నిర్వహిస్తే ఫలవంతంగా ఉండేదన్న అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. తదుపరి క్లస్టర్ సమావేశాలకు మార్చి 17నుంచి ప్రారంభంకానున్న పదోతరగతి పరీక్షల నిర్వహణ, సిబ్బంది నియామకాలు వంటివి అడ్డంకిగా ఉండే అవకాశాలు లేకపోలేదు. మండలంలోని ప్రతీ క్లస్టర్‌కు ఒక సబ్జెక్టు వంతున కేటాయించి మండల స్థాయిలో స్కూల్ అసిస్టెంట్లకు సమావేశాలు నిర్వహిస్తే అర్థవంతంగా ఉండేవని ఏపీ స్కూల్ టీచర్స్ అసోసియేషన్ (ఏపీఎస్టీయే) రాష్ట్ర సహాధ్యక్షుడు స్టీవెన్ పేర్కొన్నారు. సాయంత్రం 5.30 గంటలకు కూడా ముఖ ఆధారిత గుర్తింపు హాజరు పనిచేయలేదని, ఇక మీదట క్లస్టర్ సమావేశాలను ఉదయం 9నుంచి సాయంత్రం 4గంటల వరకే నిర్వహించాలని డిమాండ్ చేశారు.

హాజరు నమోదులో సాంకేతిక సమస్యలు

గడువులోగా సర్వేల నివేదికలను పూర్తి చేయాలి : కలెక్టర్

భీమడోలు, ఫిబ్రవరి 15 (ఆంధ్ర జ్యోతి) : సచివాలయ సిబ్బందికి కేటా యించిన వివిధ రకాల సర్వేల నివేదిక లను గడువులోగా పూర్తి చేయాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఆదేశించారు. గుండుగొలనులో శనివారం స్వచ్ఛాంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా గ్రామంలో వివిధ కార్యక్రమాల్లో పాల్గొ న్న కలెక్టర్ అధికారులకు పలు సూచన లు ఇచ్చారు. అనంతరం భీమడోలు తహసీల్దార్ కార్యా లయంలో జడ్పీ సీఈవో సుబ్బారావు, డీపీవో అనురాధ, బీసీ సంక్షేమ అధికారి నాగరాణి, తహసీల్దార్ రమాదేవి, ఎంపీడీవో పద్మావతి, సచివాలయ అధికారులతో సమావేశం నిర్వహించి పంచాయతీల వారీగా సమీక్ష నిర్వహించారు.



గుండుగొలను గ్రామస్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ వెట్రిసెల్వి

బలివే ఉత్సవాలకు విస్తృత ఏర్పాట్లు

మంత్రి సారథి



ఉత్సవాల ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రి పార్థసారథి

ముసునూరు, ఫిబ్రవరి 15 (ఆంధ్ర జ్యోతి): బలివే రామలింగేశ్వర స్వామి ఆలయంలో మూడు రోజులు పాటు జరిగే మహాశివరాత్రి ఉత్సవాలకు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్టు రాష్ట్ర గృహ నిర్మాణ, పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. ఉత్సవాల ఏర్పాట్లను శనివారం ఆయన పరిశీలించారు. స్థానిక పెద్దలు, ఆలయ అధికారులతో సమీక్షించారు. మంత్రి మాట్లాడుతూ జల్లుల స్నాన ఘాట్‌లను గత ఏడాది రెండు మాత్రమే ఏర్పాటు చేశారని, ప్రస్తుతం ఎక్కువ మంది భక్తులు స్నానాలు చేసేందుకు పంచాయతీ, ఎండోమెంట్ శాఖల ద్వారా కొత్తబోర్లు వేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. విజయడెయిరీ ఛైర్మన్ సహకారంతో లక్షన్నర వాటర్ ప్యాకెట్లు భక్తులకు అందించనున్నట్టు తెలిపారు. ప్రత్యేక శానిటేషన్ కోసం డీపీవోతో మాట్లాడామన్నారు. సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి పోలీసుల నిఘా ఉంచనున్నట్టు తెలిపారు. కాగా మంత్రి స్వామిని దర్శించుకోగా, ఆలయ ప్రధాన అర్చకుడు భాస్కరరావు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి : ఎస్పీ



కలిదిండి, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ ప్రతాప్ శివ కిశోర్ అన్నారు. కలిదిండి పోలీస్ స్టేషన్‌ను శనివారం ఆయన సందర్శించి రికార్డులను పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల తరచుగా సైబర్ మోసాలు జరుగుతున్నాయని, ఓటీపీ నెంబరు అడిగితే వెంటనే 1930 నెంబరుకు కాల్ చేయాలన్నారు. మహిళల భద్రత కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. బాలికల వసతి గృహాల వద్ద భద్రత ప్రమాణాలు దృష్ట్యా సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. అనంతరం కలిదిండి పోలీస్ స్టేషన్‌లో సీసీ కెమెరాల కంట్రోల్ రూమ్‌ను, షటిల్ కోర్టును ప్రారంభించారు. కలిదిండి పాతాళ భోగేశ్వర స్వామి ఆలయాన్ని సందర్శించి శివరాత్రి ఉత్సవాల ఏర్పాట్లను పరిశీలించారు. డీఎస్పీ శ్రావణ్ కుమార్, సీఐ రవి కుమార్, ఎస్ఐ వి.వెంకటేశ్వరరావు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఎయిడెడ్ పాఠశాలల్లో విద్యార్థులెందరు?

ఎంఈవోలకు తనిఖీ బాధ్యతలు

ఏలూరు అర్బన్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో 20 మంది కంటే తక్కువ విద్యార్థులున్న ఎయిడెడ్ స్కూల్స్ ఎన్నిఉన్నాయో లెక్క తేల్చాలని విద్యాశాఖ ఉన్నతాధికారులు పంపిన ఆదేశాలతో ఎంఈవోలు క్షేత్రస్థాయి తనిఖీలను ప్రారంభించారు. జిల్లావ్యాప్తంగా 24 ప్రాథమిక, ఉన్నత పాఠశాలలు ఎయిడెడ్ రంగంలో పనిచేస్తున్నాయి. ఆ మేరకు ఈ పాఠశాలలను ఎంఈవోలు సంద ర్శించి భౌతికంగా విద్యార్థులు ఎంతమంది హాజరవుతున్నదీ గుర్తించి నివేదికలను జిల్లావిద్యాశాఖకు పంపాల్సి ఉంటుంది.



పశ్చిమ గోదావరి జిల్లా జూనియర్ నెట్‌బాల్ బాలబాలికల జట్టు

నెట్‌బాల్ పోటీలకు జిల్లా జట్టు

పాలకోడేరు, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : తూర్పు గోదావరి జిల్లా రావులపాలెంలోని డాన్ బాస్కో హైస్కూల్ క్రీడా ప్రాంగణంలో ఈనెల 16, 17 తేదీల్లో జరగనున్న పదవ జూనియర్ అండర్-19 బాలబాలికల రాష్ట్ర స్థాయి నెట్‌బాల్ పోటీలకు ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా జట్టు పాల్గొననుందని జిల్లా నెట్ బాల్ కార్యదర్శి ఎన్.విజయలక్ష్మి తెలిపారు.క్రీడాకారులు రాణించి విజయంతో జిల్లాకు పేరు తేవాలని జిల్లా నెట్‌బాల్ సంఘ సభ్యులు పి.దావూద్ ఖాన్, వినీత్ జోసఫ్ కుమార్, విజయ్‌కుమార్, రామకృష్ణ, సుధీర్ అభినందనలు తెలిపారు.

బాలుర జట్టు : జెం.ఎర్నెస్ట్ (కెప్టెన్), డి.ఫణీంద్రకుమార్ (వైస్ కెప్టెన్), టి.దుర్గాప్రసాద్, పి.మిన్ను, కె.లోకేష్, బి.రమేష్, టి.కేశవ మణికంఠ, జి.త్రినాథ్, కె.దుర్గాగణేష్, ఎం.సంతోష్,టి.ఎలీషా,బి. యశ్వంత్ హరి వినయ్ స్టాండ్ బై జి.సురేష్, కోచ్‌గా పూడి శ్రీనివాస్, మేనేజర్‌గా వెంకటేష్ ఎంపికయ్యారు.

బాలికల జట్టు : కె.అక్షయ (కెప్టెన్), కె.మానస (వైస్ కెప్టెన్), కె.గుణవర్షిత, ఏ.పోషిత, డి.జోష్న నాగసాయి, టి.ఉమాభవాని, కె.శ్రీదేవి, వి.రమ్యశ్రీ, ఐ.లావణ్య, ఎస్.మీనాక్షి, కె.భారతి, ఇ.లిఖిత, స్టాండ్‌బై టి.మహాలక్ష్మి, కోచ్‌గా డి.నవ్యశ్రీ, మేనేజర్ పి.అక్షయ ఉన్నారు.

జాతీయస్థాయి పోటీలకు సూర్యనారాయణ ఎంపిక



తణుకు రూరల్, ఫిబ్రవరి 15, (ఆంధ్రజ్యోతి) :పంజాబ్‌లోని చండీగఢ్‌లో ఈనెల 19 నుంచి 21వ తేదీ వరకూ జరిగే జాతీయ సివిల్ సర్వీస్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలకు తణుకు మండలం మండపాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ సంకు సూర్యనారాయణ ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం మోహన్ బాబు తెలిపారు. గత నెలలో గుంటూరులో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీలలో సూర్యనారాయణ 1500 మీటర్ల విభాగం రన్నింగ్‌లో ప్రథమస్థానం సాధించడంతో జాతీయస్థాయికి ఎంపిక చేసినట్లు తెలిపారు. జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన సూర్యనారాయణను గ్రామ సర్పంచ్ జానా వెంకటలక్ష్మీ, నాయకులు అత్మకూరి రామకృష్ణ, పేరెంట్స్ కమిటీ చైర్మన్ గూడూరి మహాలక్ష్మీ తదితరులు అభినందించారు.

కునుకు కరువాయె !

ఆంధ్రజ్యోతి సండే స్పెషల్



ఇదివరకు పొద్దుగూకితే చాలు పల్లెలన్నీ పడకేసేవి..ఎనిమిదింటికే జనం మంచాల పైకి చేరి కునుకుతీసేవారు..ఇప్పుడలా కాదు..రాత్రి పది దాటినా ఇళ్లల్లో లైట్లు వెలుగుతూనే ఉంటున్నాయి..పట్టణాల్లో అయితే అర్ధరాత్రి దాటినా నిద్రలోకి వెళ్లడం లేదు.. టీవీలు, ఫోన్ల కారణంగా పట్టణం పల్లె తేడా లేకుండా అంతా నిద్ర మాట మరిచిపోతున్నారు..నిద్రలేమి వల్ల అనేక ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి..



నిద్రలేమితో అనారోగ్య సమస్యలు
సెల్‌ఫోన్, టీవీలకు బానిసలు
పని ఒత్తిడి మరో కారణం..
యువతలో స్లీప్ డిజార్డర్

తాడేపల్లిగూడేనికి చెందిన సుభాష్ స్థానికంగా ఒక ఫ్యాక్టరీలో పనిచేస్తున్నారు. రోజూ ఉద్యోగంలో 10 గంటల పాటు సిస్టమ్‌పైనే వర్క్ చేసి ఇంటికి తిరిగి వచ్చి ఇంట్లో సెల్ ఫోన్ చూస్తూ సేద తీరుతాడు. రాత్రి 12 గంటల వరకూ ఫోన్‌లో మునిగి తేలతాడు. పడుకుందామంటే ఎంతకీ నిద్ర రాకపోతే మళ్లీ సెల్ ఫోన్‌లో రీల్స్ చూస్తూనే ఉంటాడు. చివరికి అర్ధరాత్రి 2 గంటలకు నిద్రలోకి జారుకుటాడు. ఉదయం 8 గంటలకు నిద్రలేచి మళ్లీ ఉద్యోగానికి వెళ్లాలి. రోజులో ఆరు గంటలే సుభాష్ నిద్ర. దీంతో సరిగా ఆకలి లేక, తలనొప్పి, ఉద్యోగ టెన్షన్‌లో మరింత ఒత్తిడి... ఇవన్నీ కలిసి అతని ఆరోగ్యాన్ని తీవ్రంగా పాడుచేశాయి. దీంతో అసలు నిద్ర ఎందుకు పడటం లేదని వైద్యులను సంప్రదిస్తే సెల్‌ఫోన్ ఒక కారణమైతే, పనిఒత్తిడి మరో కారణమని వెంటనే దినచర్య మార్చుకోవాలని సూచనలు ఇచ్చారు. సుభాష్ తన దినచర్యను కొద్దికొద్దిగా మార్చుకుని రాత్రి 11 గంటలకు పడుకోవడం, ఉద్యోగం నుంచి ఇంటికి వచ్చాక వ్యాయామం చేయడం ప్రారంభించాడు. దీంతో తలనొప్పి, ఆకలి లేకపోవడం తదితర సమస్యలు క్రమంగా పరిష్కారమయ్యాయి.

నిద్రలేమి సమస్య ఒక్క సుభాష్‌కే పరిమితం కాదు. ఇటు చదువుకునే విద్యార్థుల నుంచి ఉద్యోగం చేసే వారి వరకూ ఈ సమస్య వెంటాడుతోంది. సెల్‌ఫోన్ వ్యసనంగా మారడం, మరో పక్క టీవీకి అతుక్కుపోవడం వల్ల నిద్ర సరిగా పట్టడం లేదనే మాట చాలామంది నుంచి వినిపిస్తోంది. ముఖ్యంగా పట్టణవాసుల్లో ఈ పరిస్థితి మరింత ఎక్కువగా కనిపిస్తోంది. సుమారు 47 శాతం మంది నిద్రలేమితో బాధపడుతున్నారని సర్వేలు చెబుతున్నాయి. వాటిలో 12 శాతం మంది భయంకరమైన నిద్రలేమితో ఇబ్బంది పడుతున్నట్టు లెక్కలు వెల్లడిస్తున్నాయి. నిద్రలేమి వల్ల తలనొప్పి, అలసట, ఏకాగ్రత కోల్పోవడంతో పాటు ఎక్కువ మంది దంపతుల్లో కనిపిస్తున్న సంతాన సమస్య, ఆకలి లేకపోవడం తదితర సమస్యలు వస్తున్నట్టు నిపుణులు వివరిస్తున్నారు.

సెల్‌ఫోన్ అంటే ఓ బాంబ్



ఉద్యోగంలో పని ఒత్తిడిని అధిగమించేందుకు సెల్‌ఫోన్ ఎక్కువగా వాడుతుంటాను. పిల్లలు కూడా ఆటలు, వీడియోలకు అలవాటు పడి ఎక్కువ సమయం ఫోన్లు, టీవీలతో కాలక్షేపం చేస్తు న్నారు. తలపోటు, ఆకలి లేకపోవడం వంటి సమ స్యలతో ఇబ్బంది పడుతున్నాం. మా ఇంట్లో సెల్ ఫోన్ వాడకం తగ్గించాక మాకు, పిల్లలకు ఆరోగ్య సమస్యలు తగ్గాయి. సెల్‌ఫోన్ అంటే పక్కలో బాంబ్ లాంటిదే.

- ఎం.నాగరాజు, సాఫ్ట్‌వేర్ ఉద్యోగి, టీపీ గూడెం

నిద్రలేమితో అనేక సమస్యలు

ఆనందకరమైన జీవనానికి సుఖ నిద్ర అవసరం. గాఢనిద్రతో పాటు ఎంతసేపు నిరంతరాయంగా పడుకున్నారనేది ఆధారపడి ఉంటుందని వైద్యులు చెబుతున్నారు. నిద్రలేమిపై హైద్రాబాద్‌లోని ఏఐజీ సంస్థ ఇటీవల నిర్వహించిన ఓ సర్వేలో ఆశ్చర్యకరమైన నిజాలు వెలుగు చూశాయి. నిద్రలేమి వల్ల గుండెబలహీన పటడం, నరాలు పటుత్వం కోల్పోవడం, జ్ఞాపకశక్తి తగ్గిపోవడం, ఆకలి కోల్పోవడం, అధిక బరువు తదితర సమస్యలు వస్తున్నట్టు వెల్లడించారు. నిద్రలేమి నుంచి ఎంత త్వరగా బయట పడితే ఆరోగ్యానికి అంత మంచిదని సూచిస్తున్నారు.

సమస్య మొదలయ్యేది ఇలా..

సరదాగా ఆటవిడుపు కోసం ప్రారంభించే సెల్‌ఫోన్ వాడకం. క్రమేకి ఒక వ్యసనంగా మారుతోంది. రాత్రి 12 గంటల వరకూ సెల్‌ఫోన్‌లో మునిగిపోవడం సర్వసాధారణం అయింది. దానికంటే ముందుకు వెళ్లి 2 గంటల వరకూ ఫోన్‌తోనే కాలక్షేపం చేస్తున్నారు. ఎంత పనిచేసి వచ్చినా పడు కునే సమయంలో ఫోన్ చూడటం చాలా మందికి దినచర్యగా మారిపోయింది. మన ఆరోగ్యం నిద్రతోనే అని తెలిసినా ఫోన్ తీసి పక్కన పెట్టలేని పరిస్థితి. ప్రస్తుతం రిలీజైన సినిమాలు కూడా ఫోన్‌లలో ప్రత్యక్షం కావడం ఇంటర్నెట్ విరివిగా వాడటంతో సెల్‌ఫోన్ భయంకరమైన వ్యసనంగా మారి పోయింది.

ఏం చేయాలి..?

నిద్ర మనిషి శారీరక, మానసిక ఆరోగ్యానికి దివ్యౌషధం. ఎంత పనిఒత్తిడిలో ఉన్నా నిర్ధిష్ట నిద్ర సమయాన్ని కేటాయించుకోవడం చాలా అవసరం. మనల్ని మనం నియంత్రించుకోగలిగితే నిద్రను ఆహ్వానించుకోవచ్చు. ఎన్ని సమస్యలు ఉన్న నిద్ర తరువాతే అన్న ఆలోచన అవసరం. యోగా, మెడిటేషన్ ఇందుకు ఉపయోగపడతాయి. ఎట్టి పరిస్థితుల్లో మత్తుకలిగించే మాత్రలు, పదార్థాలకు అలవాటు పడకూడదు. నెమ్మదిగా వంద అంకెలు ఏకాగ్రతతో లెక్కపెడితే నిద్రవచ్చే అవకాశాలు ఎక్కువని నిపుణులు సూచిస్తున్నారు. మనసులోకి ఎలాంటి ఆలోచనలు రాకుండా చూసుకోవడం మంచిది. రాత్రి 9,10 గంటల తరువాత ఫోన్ జోలికి వెళ్లకుండా ఉండటం ఉత్తమం. సెలవుల్లో తప్ప ఆన్‌లైన్‌లో సినిమాలు, ఓటీటీ వెబ్‌సిరీస్‌ల జోలికి వెళ్లకూడదు.

- తాడేపల్లిగూడెం రూరల్ (ఆంధ్రజ్యోతి)

రోజూ 8 గంటలు నిద్ర అవసరం



నిద్రలేమి వల్ల మెటబాలిజమ్ ఆగిపోతుంది. అరుగుదల తగ్గిపోయి మలబద్ధకం వస్తుంది. మనలో ఏకాగ్రత దెబ్బతింటుంది. నరాల బలహీనత మొదలవుతుంది. కిడ్నీలపై భారం పడి బీపీ, షుగర్ వ్యాధులు వచ్చి మన ఆరోగ్యాన్ని పాడు చేస్తాయి. నిద్ర వల్ల మనకు సంక్రమించే రోగనిరోధకశక్తి క్షీణిస్తుంది. ఈ సమస్యలు అధిగమించాలంటే రోజూ 8 గంటలు నిద్ర ఉండాలి. సెల్‌ఫోన్ వాడకం తగ్గించుకోవడంతో పాటు యోగా, మెడిటేషన్ చేసుకుంటే సమస్య అధిగమించవచ్చు.

- నార్ని బావాజి, వైద్యుడు,టీపీ గూడెం

భవనం పైకి లేచింది !

జాకీల సాయంతో ఐదు అడుగుల ఎత్తుకు 1995 నాటి డాబా



దెందులూరు ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) వాహనాలకు పంక్చర్ అయితే జాకీ సాయంతో వాహనాన్ని పైకి లేపి టైరు మార్చడం తెలిసిందే.. దిగబడిన పాత భవనాలను కూడా జాకీలు పెట్టి పైకి లేపడం ఎక్కడైనా చూశారా..! దెందులూరు మండలం చల్లచింతలపూడి గ్రామంలో ఈ సీన్ జరిగింది.. గౌడ వీధిలో మొదుగుమూడి వెంకటేశ్వరావుకు చెందిన డాబా 1995 సంవత్సరంలో నిర్మించారు. అయితే పక్కన ఉన్న స్థలాల్లో ఎత్తుగా భవనాలు లేవడంతో పాటు కాలక్రమేణా రోడ్డు ఎత్తు పెరగడంతో వెంకటేశ్వరరావు భవనం లోతుకి వెళ్లిపోయింది. దీంతో తమిళనాడుకు చెందిన వారికి కాంట్రాక్టు ఇచ్చారు. దీంతో వారు వచ్చి ఐదు అడుగుల ఎత్తుకు జాకీల సాయంతో భవనం పైకి లేపేందుకు చర్యలు చేపట్టారు. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పాత భవనం పడకొట్టి మళ్లీ నిర్మించాలంటే రూ.40 లక్షలు అవుతుందని కానీ ఎత్తు లేపితే 6 నుంచి 7 లక్షల రూపాయలతో పూర్తవుతుందని దానికి తోడు 20 సంవత్సరాల గ్యారెంటీ కుడా ఇస్తున్నారని అందుకే ఈ పని చేసినట్టు తెలిపారు. గ్రామస్తులతో పాటు చుట్టుపక్కలవారు వచ్చి ఈ పనులను ఆశ్చర్యంగా చూసి వెళ్తున్నారు..





ఈ భవనాన్నే పైకి లేపింది.. బీమ్‌ల కింది జాకీలు ఏర్పాటు చేసిన దృశ్యం →



పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే ఆరిమిల్లి దంపతులు, తదితరులు

పాలంగిలో వైభవంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠ

ఉండ్రాజవరం, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాలంగి రామలింగేశ్వరస్వామి వారి ఆలయం వద్ద శనివారం ధ్వజస్తంభ ప్రతిష్ఠ నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక పూజలు, హోమాలు, కుంబాభిషేకాలు, శాంతి కల్యాణం నిర్వహించారు. చాపరాల కృష్ణ, రమణకుమారి దంపతులతో వేదపండితుల పునః ధ్వజస్తంభ ప్రతిష్ఠ కార్యక్రమం జరిపించారు. రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్, ఎమ్మెల్యేలు ఆరిమిల్లి రాధాకృష్ణ, ముప్పిడి వెంకటేశ్వరరావు స్వామివారిని దర్శించి, పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆలయ ఈవో ఎమ్‌వీ రామయ్య, అర్చకులు వి.శేషురఘుబాబు ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు జరిపారు. అధిక సంఖ్యలో భక్తులతోపాటు కూటమి నాయకులు పాల్గొన్నారు.



ధ్వజస్తంభ ప్రతిష్ఠలో పాల్గొన్న మంత్రి దుర్గేష్



షాపింగ్ కాంప్లెక్స్ పరిసరాల్లో యాత్రికుల సందడి



ఆలయ అనివేటి మండపంలో పెళ్లిళ్లు

కిటకిటలాడిన చిన్న తిరుపతి

ద్వారకాతిరుమల,ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): ద్వారకాతిరుమల చిన వెంకన్న క్షేత్రం శనివారం భక్తజనులతో కిటకిటలాడింది. స్వామి వారికి ఇష్టమైన రోజు కావడంతో ఆలయం భక్తులతో పోటెత్తింది. దాదాపు ఇరవై వేల మందికి పైబడి భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. స్వామివారి ఉచిత దర్శనానికి దాదాపు రెండు గంటల పైబడి సమయం పట్టింది. మంచి ముహూర్తం ఉండటంతో చిన వెంకన్న క్షేత్రంలో శనివారం పెద్దసంఖ్యలో వివాహాలు, ఉప నయనాలు జరిగాయి. ఆలయ ప్రధాన రాజగోపురం ముందున్న పాత కల్యాణ మండపం, అనివేటి మండపంలోను జోరుగా వివాహాలు, ఉపన యనాలను నిర్వహించారు.

పట్టిసీమ మహాశివరాత్రి ఉత్సవాల ఏర్పాట్ల పరిశీలన

ఏలూరు, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : పట్టిసీమ మహాశివరాత్రి ఉత్సవ ఏర్పాట్లను శనివారం పోలవరం తహసీల్దారు సాయిరాజు పరిశీలించారు. ఫెర్రీ రేవులో టికెట్ కౌంటర్ల ఏర్పాటు, వివిధ శాఖల అధికారుల కార్య నిర్వహణా కౌంటర్లు, గోదావరిలో ఏర్పాటు చేస్తున్న కాలినడక మార్గం పనులు, ఇసుక తిన్నెల్లో చలువ పందిళ్ళు, తాత్కాలిక మరుగు దొడ్లు, బట్టలు మార్చుకునే గదుల ఏర్పాటు పనులు పరిశీలించారు. వీఆర్వోలు వెంకటేశ్వరరావు, బాపిరాజు, ఫెర్రీ కాంట్రాక్టర్ మైగాపుల సత్యనారాయణ, బొరుసు రాంబాబు, పాల్గొన్నారు.



ఏర్పాట్లు పరిశీలిస్తున్న తహసీల్దారు



క్రీడా వందనం సమర్పిస్తున్న క్రీడాకారులు

క్రీడా సంబరాలు

అట్టహాసంగా ప్రారంభమైన ఆలిండియా సివిల్ సర్వీసెస్ హాకీ టోర్నమెంట్

కాకినాడ/సర్పవరం జంక్షన్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా క్రీడాప్రాధికార సంస్థ మైదానంలో ఆస్ట్రో టర్ఫ్ ఫీల్డ్ వేదికగా 2024-25 ఆలిండియా సివిల్ సర్వీసెస్ పురుషుల, మహిళల హాకీ టోర్నమెంట్ శనివారం అట్టహాసంగా ప్రారంభమైంది. దేశంలోని 18 రాష్ట్రాలు, రెండు కేంద్రపాలిత ప్రాంతాల నుంచి 44 జట్లు పాల్గొన్నాయి. క్రీడాకారులు మార్చ్‌పాస్ట్ నడుమ పోటీలు ఘనంగా ప్రారంభ మయ్యాయి. ముఖ్యఅతిథులుగా కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్, జిల్లా ఎస్పీ బిందుమాధవ్ విచ్చేయగా కలెక్టర్ బెలూన్లు ఎగరవేసి టోర్నమెంట్ ప్రారంభించారు. క్రీడా జ్యోతిని వెలిగించారు. అతిథులుగా విచ్చేసిన అర్జున అవార్డు గ్రహీతలు మహ్మద్ రియాజ్, ముకేష్ కుమార్‌లను కలెక్టర్ సత్కరించారు. హాకీ మాంత్రికుడు ధ్యాన్‌చంద్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళుల ర్పించారు. జాతీయ జెండాను జేసీ రాహుల్‌మీనా, ఆలిండియా హాకీ టోర్నమెంట్ జెండాను అసిస్టెంట్ కలెక్టర్ భావన, రాష్ట్ర జెండాను డీఆర్వో వెంకట్రావు ఆవిష్కరించారు. రెండు వారాలపాటు నిర్వహించే ఈ టోర్నమెంట్ నిర్వహణకు సుమారు రూ.2 కోట్లు కేటాయించినట్టు అధికారులు తెలిపారు.

తొలిరోజు విజేతలు

కాకినాడ జిల్లా క్రీడామైదానంలో శనివారం జరిగిన ఆలిండియా సివిల్ సర్వీసెస్ హాకీ టోర్నమెంట్-2025లో మ్యాచ్-1లో హరియాణా జట్టు 14-0 తేడాతో హిమాచల్‌ప్రదేశ్ జట్టుపై గెలుపొందగా మ్యాచ్-2లో పాండిచ్చేరి జట్టు 10-1 తేడాతో కర్నాటక జట్టుపై విజయం సాధించింది.



క్రీడాజ్యోతిని వెలిగిస్తున్న కాకినాడ కలెక్టర్ షాన్ మోహన్, ఎస్పీ

ఎప్పటి నుంచో మనకు వ్యవసాయంతో అనుబంధం ఉంది.మన పూర్వీకులు పాడి, పంటలతో హాయిగా జీవనం సాగించేవారు. రసాయనాలు లేని పంటలు పండిస్తూ సంప్రదాయ వ్యవసాయం చేయడం ద్వారా నాణ్యత గల వరిని ఉత్పత్తి చేసేవారు. ప్రస్తుతం వ్యవసాయంలో రసాయనిక ఎరువుల వినియోగం పెరిగి పోయింది.. తినే ఆహారం విషమవుతోంది.. ఇటువంటి పరిస్థితుల్లో సేంద్రియ వ్యవసాయం వైపు అడుగులు వేస్తూ రైతుల్లో అవగాహన పెంచుతున్నారు దెందులూరు మండలం సీతంపేట గ్రామానికి చెందిన గద్దె సతీష్‌బాబు.. లక్షల్లో జీతం వచ్చే ఉద్యోగం వదులుకుని సొంతూరులో సంప్రదాయ సేద్యానికి శ్రీకారం చుట్టారు..



వ్యవసాయ సేవకుడు

ఉద్యోగం వదిలి సంప్రదాయ వ్యవసాయం
పశువుల పేడ, సహజసిద్ధ ఎరువులతో పంటల సాగు
రైతులకు ఆదర్శంగా సీతంపేట సతీష్‌బాబు

దెందులూరు మండలం కొత్త గూడెం పంచాయతీ సీతంపేట గ్రామానికి చెందిన గద్దె సతీష్‌బాబు గ్రాడ్యు యేషన్ పూర్తి చేశారు. సేంద్రియ పద్ధతుల్లో వ్యవసాయం చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. కంపోస్ట్ ఎరువు, పచ్చిరొట్ట, పశులపేడ ద్వారా సారవంతమైన భూమిగా తయారు చేసి పంటలను పండిస్తున్నారు. సీతం పేట గ్రామంలోని 16 ఎకరాల్లో కొబ్బరి వేశారు. మరో 19 ఎకరాల్లో వరి, కొన్ని ఎకరాల్లో మొక్క పంట వేశారు. ఈయన వ్యవసాయ క్షేత్రంలో 40 వరకు గేదేలు, ఆవులు ఉన్నాయి. తన వరి పొలంలో ఆర్గానిక్ బియ్యం పండిస్తున్నారు. నేల సంరక్షణ, మిశ్రమ వ్యవసాయం, పంట మార్పిడి, వ్యవసాయ వ్యర్థాలను వినియోగించడం, వంటి పద్ధతుల్లో వ్యవసాయం చేస్తున్నారు 2018, 2020 సంవత్సరాల్లో జాతీయ, రాష్ట్రస్థాయిలో ఉత్తమ రైతుగా, ఆదర్శ రైతుగా అవార్డులను అందుకున్నారు.

గళ్ల మార్పిడి పద్ధతి

తన 50 ఎకరాల పొలాన్ని 365 భాగాలుగా చేసి రోజుకు ఒక భాగంలో 50 గేదెలను ఒకరోజు ఉండేలా ఏర్పాటు చేసుకున్నారు. ఈ 50 గేదేల ద్వారా వచ్చిన పేడ, మూత్రాలను ఆరోజు ఆదే ప్రాంతంలో పడేలా చూసుకుంటారు. ఆ విధంగా 365 రోజులు 50 ఎకరాల్లో గేదె పేడ, మూత్రాలు అందే విధంగా జాగ్రత్తలు తీసుకుంటారు. దీని వల్ల భూమికి పంటకు అవసరమైన పోషకాలు అందుతాయని దీంతో పాటు చీడ పీడల సమస్య పెద్దగా ఉండదని సతీష్ బాబు చెబుతున్నారు. రైతులు పంట సాగుతో పాటు పశుపోషణ చేపట్టాలి. ప్రతి నిత్యం చట్టి పిల్లల మాదిరిగా పంటలలో వచ్చే మార్పులను గమనిస్తూ వ్యవసాయం చేయాలని తెలిపారు. రసాయనాలు లేకుండా పూర్తిగా సేంద్రియ సాగు ద్వారా నాణ్యత గల ఆరోగ్యాన్ని ఇచ్చే వరిని ఉత్పత్తి చేస్తున్నారు. కిలో ఆర్గానిక్ రూ.80 నుంచి 100 వరకు విక్రయిస్తున్నారు.

శాస్త్రవేత్తల ప్రశంసలు

ఎలాంటి రసాయనాలు వాడకుండా తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు సాధించడం, సహజసిద్ధమైన ఎరువుల వినియోగం తదితర అంశాలపై జాతీయస్థాయిలో పలు సెమినార్లలో పాల్గొని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ చేసి ప్రశంసలు పొందారు. అంతేకాదు.. సతీష్‌బాబు జాతీయ స్థాయి హాకీ పోటీల్లో పాల్గొని అత్యంత ప్రతిభ కనరబరిచిన క్రీడా విభాగంలో ఉద్యోగం సాధించారు. వ్యవసాయం మీద మక్కువతో ఉద్యోగం వదులుకున్నారు. ఇప్పటికీ సతీష్ హాకీ క్రీడా అసోసియేషన్ కార్యదర్శిగా ఉన్నారు.

-దెందులూరు (ఆంధ్రజ్యోతి)



పొలంలో పశువులను కట్టివేసిన దృశ్యం



పౌల్ట్రీ కూలీల ఉపాధికి దెబ్బ

తణుకు రూరల్, ఫిబ్రవరి 15, (ఆంధ్రజ్యోతి) : బర్డ్‌ఫ్లూ వైరస్‌తో ఉభయ గోదావరి జిల్లాల్లోని పౌల్ట్రీ పరిశ్రమ సంక్షోభం నెలకొనడంతో కూలీలు రోడ్డున పడే పరిస్థితులు న్నాయి. తణుకు మండలం వేల్పూరు, ఉంగుటూరు మండలం బాదంపూడి, పెరవలి మండలం కానూరు గ్రామాల్లోని పౌల్ట్రీ ఫారాల్లోని కోళ్లకు బర్డ్‌ఫ్లూ లక్షణాలు వున్నట్లు బోపాల్‌లోని హైసెక్యూరిటీ ల్యాబ్ రిపోర్టులు ఇవ్వడంతో ఆయా ఫారాలకు ఒక కిలోమీటరు పరిధిలో రెడ్ జోన్‌గా ప్రకటించింది. పౌల్ట్రీ పరిశ్రమలో ప్రతీ 10 షెడ్లలో నలుగురు కార్మికులు పని చేస్తున్నారు. ఉభయ గోదావరి జిల్లాలోని మూడు రెడ్ జోన్ పరిధిలో 80 లక్షల కోళ్లు వున్నాయి. రెడ్ జోన్‌లో 3,200 మంది కూలీలు పని చేస్తున్నారు. మన ప్రాంతానికి చెందిన స్థానికులు కొందరైతే బీహార్, ఒడిశా, బెంగాల్‌కు చెందిన వలస కూలీలు ఎక్కువగా వున్నారు. వీరితో పాటు ఫారాల్లోని కోడి గుడ్లను ప్యాకింగ్ చేసేందుకు ఒక్కో లారీకి ఆరుగురు కూలీలు అవసరవుతారు. ఈ లెక్కన స్థానికంగా అమ్మకం చేసే గుడ్లు కాకుండా మన జిల్లాల నుంచి రోజుకు 300 నుంచి 400 లారీల కోడి గుడ్లు ఎగుమతి అవుతాయి. వీటి ప్రకారం రోజుకు 300 లారీలు ఎగుమతికి రోజుకు 1800 మంది కూలీలకు ఉపాధి లేకుండా పోయే పరిస్థితి ఏర్పడింది. కోడి గుడ్లను ప్యాకింగ్ చేసే అట్టలు, కోడి గుడ్లను పేర్చేందుకు ఉపయోగించే ట్రేలను తయారు చేసే పరిశ్రమలలో పనిచేసే కార్మికులు, పరోక్షంగా కోళ్లకు టీకాలు వేసి ఉపాధి పొందేవారు, కోళ్ల షెడ్‌లను నిర్మించేందుకు, రిపేర్లు చేసేందుకు పనిచేసే కూలీలు కూడా ఉపాధి కోల్పోతున్నారు. పౌల్ట్రీ పరిశ్రమకు ఇబ్బంది కలిగితే జరిగే అనర్థాలను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం ఉద్దీపన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

• ప్యాకింగ్ పనులు తగ్గిపోయాయి



కోళ్లకు బర్డ్‌ఫ్లూ వైరస్ కారణంగా తణుకు ప్రాంతంలోని కొన్ని కోళ్ల ఫారాల్లో కోళ్లు చనిపోవడంతో గుడ్లు తగ్గిపోయి ప్యాకింగ్ పనులు తగ్గిపోయాయి. గతంలో మాదిరిగా రోజూ పని దొరకడం లేదు. రెడ్‌జోన్, ఎల్లో జోన్ దాటి ఇతర ప్రాంతాల్లోని ఫారాల నుంచి కోడిగుడ్ల ప్యాకింగ్ పని దొరకడం కష్టంగా వుంది.

-కొల్లి మూర్తి, కోడి గుడ్ల ప్యాకింగ్ కార్మికుడు, తేతలి

• ఉపాధి కోల్పోయిన కూలీలను ఆదుకోవాలి



పౌల్ట్రీ పరిశ్రమలో వచ్చిన సంక్షోభం కారణంగా ఉపాధి కోల్పో యిన కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలి. కోళ్ల ఫారాల వద్ద పని చేసే స్థానిక, ఇతర ప్రాంతాల నుంచి వచ్చి కూలిపనులు చేసు కుంటూ జీవిస్తున్న కూలీలకు ప్రభుత్వం ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలు కల్పించాలి.

-బళ్ల చిన వీరభద్రరావు, జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం సహాయ కార్యదర్శి, వేల్పూరు.

• పౌల్ట్రీ పరిశ్రమను ఆదుకోవాలి

ప్రస్తుతం బర్డ్‌ఫ్లూ వైరస్ కారణంగా నష్టపోయిన రైతులను ఆదుకోవాలి. అందుకు కోడిగుడ్లు, చికెన్ వినియోగం నిషేధం రెడ్ జోన్‌లో మాత్రమే పరిమితం చేయాలి. మిగిలిన ప్రాంతాల్లో చికెన్, కోడిగుడ్లు యధావిధిగా వినియోగం జరిగేలా ప్రజలలో అవగాహన కల్పించాలి. ఇందుకోసం ప్రభుత్వం, పౌల్ట్రీ రైతులు, అధికారులతో చికెన్ మేళా వంటి కార్యక్రమాలు నిర్వహించాలి

-మల్లిన రాధాకృష్ణ, మాజీ మున్సిపల్ కౌన్సిలర్, తణుకు

అంతా సేఫ్..!

ఎవరికీ వైరస్ లక్షణాలు లేవని తేల్చిచెప్పిన ల్యాబ్ రిపోర్టులు

బాదంపూడి 'బర్డ్‌ఫ్లూ' ప్రాంత వాసులకు భరోసా



వేల్పూరులో పౌల్ట్రీ ఫారం వద్ద ఫొటో గ్యాలరీ పరిశీలిస్తున్న పశుసంవర్ధక శాఖ ముఖ్య కార్యదర్శి బుడితి రాజశేఖర్, డైరెక్టర్ దామోదర్ నాయుడు, కలెక్టర్ నాగరాణి తదితరులు

ఏలూరు అర్బన్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి):బర్డ్ ఫ్లూ వైరస్ ఆనవాళ్లు మనుషులకు(ఇన్‌ఫ్లూయింజా) తాకవచ్చునన్న సందేహాలు, అపోహలు, అనుమానాలు, దుష్ప్రచారానికి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ వర్గాలు తెరదించాయి. బాదంపూడిలో రెడ్‌జోన్‌గా ప్రకటించిన పౌల్ట్రీ, పరిసర ప్రాంతాల్లో నివసిస్తున్న వారి నుంచి ర్యాండమ్‌గా శ్వాబ్ నమూనాలను ఇన్‌ఫ్లూయింజా వైరస్ నిర్ధారణ నిమిత్తం విజయవాడ సిద్దార్థ వైద్య కళాశాల ల్యాబ్‌కు ఇటీవల పంపించారు. ఈ ఫలితాలు శనివారం వచ్చాయి. ఎవరికీ వైరస్ సోకిన దాఖలాలు లేవని వైద్య నిపుణుల ఇందులో తేల్చారు. ఆ పౌల్ట్రీలో పనిచేసే కుటుంబాలు, సమీప కుటుం బాల నుంచి ఆరోగ్య విషయాలను సేకరించడం, తాగునీటి వనరుల పరీక్షలతోపాటు శ్వాబ్ నమూనాలను ర్యాండమ్‌గా 42 మంది నుంచి సేకరించారు. వీటిని పీసీఆర్ టెస్టింగ్ నిమిత్తం విజయవాడ స్టేట్ టెస్టింగ్ ల్యాబ్‌కు పంపించారు. నమూనాల పరీక్షల్లో మొత్తం 42 శాంపిల్స్ నెగిటివ్ రిపోర్టు వచ్చాయి. రెడ్‌జోన్ పరిధిలోని 972 నివా సాల్లో హౌస్ హోల్డ్ సర్వే చేపట్టాలని ఉన్నతాధికారులు ఆదేశించగా, శనివారం నాటికి సర్వే పూర్తయిందని వివరించాయి. ఎవరికీ జలుబు, జ్వరం వంటి లక్షణాలు సర్వేలో బయటపడలేదని తెలిపాయి.



బాదంపూడి పౌల్ట్రీలో పరిశీలిస్తున్న పశు సంవర్ధక శాఖ డైరెక్టర్ దామోదర నాయుడు, జేడీ గోవిందరాజులు

బర్డ్‌ఫ్లూపై వేగంగా స్పందించాం

రెడ్‌జోన్ మినహా మిగిలిన వారు చికెన్ గుడ్లు తినవచ్చు

పశుసంవర్ధక శాఖ ముఖ్య కార్యదర్శి రాజశేఖర్

తాడేపల్లిగూడెం రూరల్/ఉంగుటూరు, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): తణుకు మండలం వేల్పూరు, ఉంగుటూరు మండలం బాదం పూడిలోని బర్డ్ ఫ్లూ వైరస్ ప్రభావిత కోళ్ల ఫారాలను రాష్ట్ర పశు సంవర్ధక, డెయిరీ డెవలప్‌మెంట్ ముఖ్య కార్యదర్శి బుడితి రాజశేఖర్ పరిశీలించారు. మృత్యువాత పడిన కోళ్లను ఏ విధంగా ఖననం చేశారో పశుసంవర్ధక శాఖ అధికారులు, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. పరిసర ప్రాంతాల ప్రజలు ఏమైనా ఇబ్బంది పడుతున్నారా ? ఎటువంటి ఆహార నియమాలు పాటించేలా శ్రద్ధ తీసుకున్నారు ? మానసికంగా ఏమైనా ఇబ్బంది పడుతున్నారా ? తదితర అంశాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బర్డ్ ఫ్లూ బయటపడిన నాలుగు జిల్లాల్లోని ఐదు కోళ్ల ఫారాల్లోని రెడ్ జోన్ ప్రాంతాల్లోవున్న కోళ్లను నూరు శాతం ఖననం చేసినట్లు చెప్పారు. ఈ వైరస్ మొదట బాదం పూడి ఫారంలో బయటపడిందని తెలిపారు. ఇది బయటపడిన వెంటనే ప్రభుత్వం అన్ని చర్యలను యుద్ధప్రాతిపదికన చేపట్టిందన్నారు. రెడ్ జోన్ ప్రాంతాలు మినహా మిగిలిన ప్రాంతాల ప్రజలు కోడి గుడ్లు, చికెన్ ఉడికించి తినవచ్చు తెలిపారు. పశుసంవర్ధక శాఖ డైరెక్టర్ దామోదర్ నాయుడు, కలెక్టర్ చదలవాడ నాగరాణి, పశుసంవర్ధక శాఖ అధికారులు మురళీకృష్ణ, టి.గోవిందరాజులు, తహసీల్దార్ అశోక్‌వర్మ, పశువైద్యాధికారి కె.శంకర్ భావనారాయణ, తదితరులు పాల్గొన్నారు.



యలమంచిలి మండలం ఊటాడ పౌల్ట్రీఫారంలో చనిపోయిన కోళ్లు



కొల్లేరు పక్షులకు ముప్పు లేదు

పక్షుల కదలికలపై అటవీ శాఖ ఆరా

కైకలూరు, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): కొల్లేరు వలస పక్షులకు బర్డ్ ఫ్లూ వైరస్ ముప్పు ఏమైనా ఉంటుందా ? అని అటవీ శాఖ అధికారులు నిఘా పెట్టారు. వివిధ దేశాల నుంచి పక్షులు కొల్లేరుకు వేల సంఖ్యలో వస్తుంటాయి. ఇక్కడ సంతానోత్పత్తి చేసుకుంటాయి. ఈ క్రమంలో వీటికి బర్డ్‌ఫ్లూ వచ్చే అవకాశం ఉంటుందంటూ ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో కైకలూరు మండలం ఆటపాక పక్షుల కేంద్రంతోపాటు కొల్లేరు సరస్సు పరివాహక ప్రాంతంలో పక్షుల కదలికలను అటవీ శాఖ అధికారులు పరిశీలిస్తున్నారు. ఎక్కడైనా పక్షులు అనారోగ్యానికి గురైనట్లు గుర్తిస్తే వాటికి వైద్య సేవలు అందించేందుకు అప్రమత్తంగా ఉన్నారు. దీనిపై అటవీ శాఖ రేంజర్ రామలింగాచార్యులు మాట్లాడుతూ 'కొల్లేరు సరస్సులో స్వదేశీ, విదేశీ పక్షులకు బర్డ్‌ఫ్లూ ముప్పు ప్రస్తుతానికి ఎక్కడా లేదు. అటవీ సిబ్బంది పక్షుల కదలికలను గమనిస్తున్నారు. ఏదైనా అనుమానం వుంటే వెంటనే పశువైద్యాధికారులను సంప్రదిస్తాం. ఆటపాక పక్షుల కేంద్రంలోని పక్షులను ప్రతీ రోజూ పరిశీలిస్తున్నాం' అని తెలిపారు.

పెరిగిన చేపలు, రొయ్యల ధరలు

బర్డ్‌ఫ్లూ ఎఫెక్ట్

ఆకివీడు, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): బర్డ్ ఫ్లూ కారణంగా ఆకివీడులో చికెన్ అమ్మకా లను నిషేధించడంతో మాంసాహారులు చేపలు, రొయ్యల వైపు చూస్తున్నారు. ఫలి తంగా రెండు రోజుల నుంచి వీటి కొనుగోళ్లు పెరిగాయి. హోల్‌సేల్ చేపల మార్కెట్‌కు శీలావతి, కట్లా, గడ్డి చేపల, బంగారు తీగ చేపలతోపాటు రొయ్యలు, పీతలు భారీ స్థాయిలో వస్తున్నాయి. వీటికి డిమాండ్ ఏర్పడిన నేపథ్యంలో కిలో చేపకు రూ.10 ధర పెరిగింది. రానున్న రోజుల్లో మరింత పెరిగే అవకాశం ఉందని వర్తకులు చెబుతు న్నారు. శనివారం హోల్‌సేల్ చేపల మార్కె ట్ అమ్మకాలు జోరుగా జరిగాయి. ముక్క లేనిదే ముద్ద దిగని మాంసం ప్రియులు ఆదివారం హోల్‌సేల్ చేపల మార్కెట్‌కు వస్తే అమ్మకాలు అధికంగా జరుగుతాయని అంటున్నారు.

ఆకివీడులో చికెన్ అమ్మకాలు నిషేధం..

మార్చి తొమ్మిదో తేదీ వరకు చికెన్, గుడ్లు అమ్మకాలను నిషేధిం చాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారంటూ నగర పంచా యతీ అధికారులు శనివారం ఆకివీడులో హోటల్స్, రెస్టారెంట్లు, చికెన్ సెంట ర్లలో తనిఖీలు చేపట్టారు. చికెన్ పలావు తదితర ఐటెమ్స్ అమ్ముతున్న రెస్టారెంట్ యజమాని కి రూ.2 వేలు జరిమానా విధించారు. చికెన్ సెంటర్ ఫ్రిజ్‌లో నిల్వ చేసిన 25 కేజీల కోళ్లను స్వాధీనం చేసుకొని డంపింగ్ యా ర్డులో ఖననం చేయించారు. నగర పంచా యతీ మేనేజర్ వెంకటేశ్వరరావు, ఇన్‌స్పెక్టర్ శాకేత్ మాట్లాడుతూ పట్టణ పరిధిలో చికెన్ కు సంబంధించి సరుకు దొరికితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు వీటి అమ్మకాలను నిషేధించినట్లు తహసీల్దార్ నండూరి వెంక టేశ్వరరావు తెలిపారు. బర్డ్‌ఫ్లూ విస్తరించిన ప్రాంతాలు మినహా మిగిలిన అన్నిచోట్ల చికెన్, కోళ్లు, గుడ్లు అమ్మకాలు చేయవచ్చని అధికారులు చెబుతున్నప్పటికీ.. ఆకివీడులో ఇలా నిషేధం ఏమిటో అర్థం కావడం లేని వ్యాపారులు వాపోతున్నారు. దీనిపై కలెక్టర్ స్పష్టత ఇవ్వాలని కోరుతున్నారు.



ఆకివీడు హోల్‌సేల్ చేపల మార్కెట్‌లో రద్దీ

గుండెపోటుతో ఉపాధి హామీ కార్మికురాలి మృతి



జయమ్మ(ఫైల్)

దెందులూరు, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న మహిళ గుండె పోటుతో మృతి చెందింది. దెందులూరు మండలం ముప్పవరం పంచాయతీ పరిధిలోని కండ్రిగ నరసింహ పురం గ్రామానికి గొలిమే వెంకటేశ్వరావు భార్య గొలిమే జయమ్మ (50) రోజు మాదిరిగానే ఉపాధి పనికి వెళ్లింది. శనివారం గరికముక్క చెరువులో పని చేస్తుండగా జయమ్మ సొమ్మ సిల్లిపడిపోయింది. తోటి కూలీలు చెరువు నుంచి బయటకు తీసుకో స్తుండగా ఆమె మృతి చెందినట్టు జాతీయ ఉపాధి హామీ పథకం ఏపీవో దశరథ రాంజీ, గ్రామస్తులు తెలిపారు.

హెచ్‌ఎంకు షోకాజ్ నోటీసు

ఏలూరు, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి) : జంగారెడ్డిగూడెం మండలం లక్కవరం గ్రామంలోని రెడ్డిపేట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం సుబ్రహ్మణ్యంకు జిల్లా విద్యాశాఖాధికారిణి వెంకట లక్ష్మమ్మ షోకాజ్ నోటీసులు జారీ చేశారు. మండల విద్యాశాఖాధికారులు బి.రాముడు,జి.రాములు శనివారం హెచ్‌ఎం సుబ్రహ్మణ్యంకు నోటీసు లు నేరుగా అందజేసినట్టు తెలిపారు. గత కొంతకాలంగా పాఠశాల విద్యార్థుల ఎదుట దైవ దూషణ చేయడం, కించపరిచేలా మా ట్లాడటం, విద్యార్థుల పట్ల అనుచితంగా ప్ర వర్తిస్తున్న ప్రధానోపాధ్యాడిపై ఆగ్రహించిన విద్యార్థులు తల్లిదండ్రులు శుక్రవారం పాఠ శాల వద్ద ఆందోళన చేపట్టి విద్యాశాఖాధి కారులకు ఫిర్యాదు చేసిన విషయం విదితమే.

గెలుపుపై ధీమా..

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్ని కలపై తెలుగుదేశం కూటమి అన్ని కోణాల్లోనూ దృష్టి పెట్టింది. పట్ట భద్రులను సర్వే చేసి విజయావకాశా లపై ఆరా తీసింది. ఉభయ గోదావరి జిల్లాల పరిధిలో 34 నియోజకవర్గాల్లోనూ ఓ ప్రైవేటు ఏజన్సీ సర్వే నిర్వ హించింది. తెలుగుదేశం నాయకులకు సర్వే సమాచా రంపై ఉప్పందింది. సర్వే వివరాలతో కూటమి అభ్యర్థి విజయం ఏకపక్షమేనన్న ధీమా నాయకుల్లో నెలకొంది. ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, ప్రైవేటు సంస్థల్లో పనిచేసే పట్టభద్రులు, ఇతర రాష్ట్రాలు, జిల్లాల్లోనూ ఉద్యో గాలు చేసుకుంటున్న ఓటర్ల నాడిని సంబంధిత ఏజన్సీ తెలుసుకుంది. అన్ని నియోజకవర్గాల్లోనూ కూటమి అభ్య ర్థికి సానుకూలత ఉందని సర్వే తేలినట్టు సమాచారం. కూటమి నాయకులు సైతం సర్వే ఏజన్సీలతో మంత నాలు సాగిస్తున్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీపడే సత్తా ఉన్న అభ్యర్థులపైనా ఏజన్సీ నుంచి వివ రాలడిగి తెలుసుకుంటున్నారు. వైఎస్‌ఆర్ కాంగ్రెస్ ఎన్ని కలకు దూరంగా ఉంది. మరోవైపు పట్టభద్రులు అభివృ ద్ధివైపు సానుకూలంగా ఉండటం కూడా కూటమి అభ్య ర్థికి కలసి వస్తున్నట్టు సర్వేలో తేలింది. ఇప్పటికే గ్రామాల వారీగా ఓటు నమోదు చేసుకున్న పట్టభద్రుల వివరా లను కూటమి శ్రేణులు సేకరించాయి. ఫోన్ నెంబర్ లతో సహా వివరాలను రాబట్టారు. పట్టభద్రులతో సంప్ర దింపులు జరుపుతున్నారు.హైదరాబాద్, చెన్నయ్, బెంగ ళూరు, విశాఖపట్నం తదితర ప్రాంతాల్లో ఉన్న పట్ట భద్రులు ఎన్నికల నాటికి ఇక్కడకు వచ్చేలా ఏర్పాట్లు

సర్వే నాడితో కూటమిలో ఆనందం - అభివృద్ధికే పట్టభద్రుల ఓటు అంటూ విస్తృతంగా చర్చలు

చేసుకుంటున్నారు. కూటమి శ్రేణులను ఎన్నికల కోసం సమాయత్తం చేసేలా ఇన్‌చార్జ్ మంత్రులు, నియోజ కవర్గ పరిశీలకులు సమావేశాలు ఏర్పాటు చేస్తున్నారు. అయితే గెలుపు తమదేనన్న అతిధీమా కూడా కూటమి నేతల్లో కనిపిస్తోంది. ఇదిలాంటే ఉప్పందిన సర్వేలను బట్టే తమలో ఈ ధీమా అంటూ నాయకులు పేర్కొంటున్నారు.

భారీగా ఓట్లు వేయిద్దాం : మంత్రి గొట్టిపాటి రవికుమార్



మాట్లాడుతున్న రాష్ట్ర మంత్రి రవికుమార్

తాడేపల్లిగూడెం రూరల్, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): ఉభయ గోదావరి జిల్లాల్లో పట్ట భద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరంను భారీ మెజార్టీతో గెలిపిం చేలా కూటమి నాయ కులు పనిచేయాలని పశ్చిమ గోదావరి జిల్లా ఇన్‌చార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్ పిలుపు నిచ్చారు. తాడేపల్లిగూడెంలో దొరల కళ్యాణ మండపం వద్ద శనివారం ఎమ్మెల్సీ ఎన్నికల సమ న్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామకృష్ణంరాజు మాట్లాడుతూ కూటమి నాయకులంతా సైనికుల్లా పని చేసి పేరాబత్తుల రాజశేఖరంను అఖండ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ప్రభుత్వ విప్, తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ ఓటర్లు ఏ ప్రాంతంలో ఉన్నా రప్పించే బాధ్యత తీసుకుంటామని అన్నారు. అభివృద్ధికే ఓటు అనేలా విద్యావంతులు ఎమ్మెల్సీ ఎన్నికల్లో నిరూపించబోతున్నారని అన్నారు. ఏపీ ఏఐఐసీ చైర్మన్ రామరాజు మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అభివృద్ధి దిశగా అడుగులు వేస్తోందని విద్యావంతులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేలా పాలన సాగుతోందన్నారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వలవల బాబ్జి మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన హామీలన్ని నెరవేరుస్తోందని ఈ విషయాలు గుర్తించి ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరంను గెలిపించాలని పిలుపునిచ్చారు.

అవినీతిపై విచారణకు ఆదేశం

'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందించిన డీఎఫ్‌వో



రైతుతో మాట్లాడుతున్న అధికారి(ఫైల్)

నిడమర్రు ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి) : 'ఆంధ్రజ్యోతి' దినపత్రికలో శనివారం ప్రచురితమైన 'లంచం ఇస్తేనే సాగు' కథనానికి విశేష స్పందన వచ్చింది. ఈ కథనం వీక్షించిన కొల్లేరు తీర ప్రాంత రైతులు అధికారుల తీరుపై మండిపడుతున్నారు. రైతు పోలయ్య ధైర్యం చేసి అటవీ శాఖ అధికారుల అవినీతిని బహిర్గతం చేయడం పట్ల సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. జిల్లా ఫారెస్టు అధికారులు సైతం వేగంగా స్పందించారని, అయితే చర్యలు కూడా నిష్పక్షపాతంగా చేపట్టాలని తోటి రైతులు కోరుతున్నారు. ఈ విషయమై ఏలూరు రేంజ్ అధికారి విజయలక్ష్మిని విచారణాధికారిగా నియమిస్తూ ఏలూరు డిస్ట్రిక్ ఫారెస్టు ఆఫీసర్(డీఎఫ్‌వో -వైల్డ్ లైఫ్)బి.విజయ ఆదేశాలిచ్చారు. ఏలూరు రేంజ్ అధికారి ఒకరు బాధిత రైతు మండా పోలయ్యకు ఫోన్ చేసి ఏలూరు కార్యాలయానికి వచ్చి కాగితాలు ఇవ్వాలని కోరారు. దీనిపై రైతు ఆందోళన వ్యక్తం చేస్తూ కూలి పనులు చేసుకుని జీవించే తాను ఏలూరు ఎలా రాగలనని అధికారికి వివరణ ఇచ్చారు. అయితే కాగితాలు రాసి పంపించాలని ఆ అధికారి కోరినట్టు రైతు పోలయ్య తెలిపారు. ఏలూరు ఆఫీసుకు వెళితే తమ పరిస్థితి ఏమిటని రైతు ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే విషయమై బాధిత రైతు నుంచి వివరాలు కోరారు. స్థానికంగానే విచారణ జరగాలని, జిల్లా స్థాయి అధికారులు ఆదేశించిన విధంగా విచారణపై ఎలాంటి అనుమానాలు తలెత్తకుండా చూసు కోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. ఇదే విషయమై డి.ఎఫ్.ఒ. బి.విజయ మాట్లాడుతూ అధికారులు సంబంధిత మండలానికే వెళ్లి విచారణ చేపట్టాలని అధికారులను ఆదేశించినట్టు తెలిపారు. విచారణ నివేదిక వచ్చిన వెంటనే బాధ్యులపై క్రమశిక్షణా చర్యలు ఉంటాయని అన్నారు.

రైలు నుంచి జారిపడి గుంటూరు వాసి మృతి

దెందులూరు, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి) : గుర్తు తెలియని రైలు బండి నుంచి జారి పడి 42 ఏళ్ల వ్యక్తి మృతి చెందాడు. రైల్వే ఎస్‌ఐ సుమాన్ మాట్లాడుతూ గుంటూరు జిల్లా చేబ్రోలు గ్రామానికి చెందిన చెల్లంచర్ల మేరయ్యగా గుర్తించినట్టు తెలిపారు. శనివారం తెల్లవారు జామున రైలు బండి నుంచి జారిపడి మతి చెందినట్టు తెలిపారు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని ఏలూరు ఆస్పత్రికి తరలించినట్టు తెలిపారు.



వైద్యం పొందుతున్న బర్రింకలపాడు ఏపీ గురుకుల కళాశాల విద్యార్థులు

విద్యార్థులపై తేనెటీగల దాడి

జీలుగుమిల్లి, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): ఏలూరు జిల్లా జీలుగుమిల్లి మండలం బర్రింకలపాడు ఏపీ గిరిజన బాలుర గురుకుల కళాశాలలో శనివారం మధ్యాహ్నం 20 మంది విద్యార్థులపై తేనెటీగలు దాడిచేశాయి. వీరిలో తొమ్మిది మంది తీవ్రంగా గాయపడడంతో వారిని జీలుగుమిల్లి పీహెచ్‌సీకి తరలించి వైద్యం అందిస్తున్నారు. తరగతి గది కిటీకి నుంచి పెద్ద గుంపుగా ఒక్కసారిగా వచ్చాయి. అప్రమత్తమైన విద్యార్థులు కొందరు కిటీకి తలుపులు మూసివేసే క్రమంలో పలువురి కంటిపై, ముఖం, చెవులు, దవడలు, చేతులపై కుట్టాయి. విద్యా ర్థులు పెద్దపెట్టున హాహాకారాలు చేశారు. ఏఎన్‌ఎం కన్నమ్మ వీరిని జీలుగు మిల్లి పీహెచ్‌సీకి తీసుకువచ్చారు. వైద్యాధికారి గాయత్రి చికిత్స అందించారు. వీరి పరిస్థితి మెరుగ్గానే ఉందని తెలిపారు. గాయాలపాలైన వారిలో రాఘవేంద్ర, నాగేంద్రకుమార్, గౌతమ్, కుమార్, ప్రసాద్, సాయితేజ, చంద్రమోహన్, విజయ్‌బాబు, సాయిబాబుతో పాటు అధ్యాపకులు జయకర్ జాన్సన్ ఉన్నారు.

తేలిన ఎమ్మెల్సీ ఓటర్ల లెక్క

అత్యధికం కాకినాడ.. అత్యల్పం అల్లూరి జిల్లా

ఏలూరు, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి) : తూర్పు - పశ్చిమ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికకు ఓటర్ల లెక్క తేలింది. ఓటర్ల చేర్పులకు ఎన్నికలకు నామినేషన్ల స్వీకరణ ముగిసిన ఈ నెల 10వ తేదీ వరకు గడువు ఇవ్వగా, స్వల్పంగా హెచ్చు, తగ్గులు ఆయా జిల్లాల్లో చోటు చేసుకున్నాయి. ఓవరాల్‌గా లెక్క తేలారు. ఆరు జిల్లాల పరిధిలో మొత్తంగా 456 పోలింగ్ కేంద్రాల్లో మొత్తం 3,14,984 మంది ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఓటర్ల పరంగా కాకినాడ జిల్లాలో అత్యధికంగా 70,542 మంది ఉండగా, అత్యల్పంగా అల్లూరు సీతారామరాజు జిల్లాలో 4,669 మంది ఓటర్లు ఉండటం గమనార్హం.

అర్హతకు ఈ పత్రాలు...

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వేయడానికి ఓటు లిస్టులో ఉంటే సరిపోదు. దీనికి సంబంధించి అర్హతా పత్రంను గ్రాడ్యుయేట్ కలిగి ఉండాలి.అవి ఇవే.. ఓటరు ఐడీ కార్డు, ఫాన్, ఆధార్ కార్డు, డ్రైవింగ్ లైసెన్సు, డిగ్రీ అర్హతా సర్టిఫికెట్లు, ప్రైవేట్ సంస్థల్లో పనిచేసే వారి హోదాతో జారీ చేసే కార్డులు సరిపోతాయి. బీఎల్‌వోలు ఇంటింటికీ వచ్చి ఓటరు స్లిప్పులు ఇవ్వనున్నారు. అయితే ఈ స్లిప్‌లు కేవలం ఎంట్రీకి ఉపయోగపడతాయని, ఓటరు తన అర్హతా పత్రాల్లో ఏదో ఒకటి తప్పనిసరిగా తీసుకెళ్లాలని అధికారులు పేర్కొంటున్నారు.

జిల్లాల వారీగా ఓటర్ల తుది జాబితా

జిల్లా	పోలింగ్ కేంద్రాలు	పురుష ఓటర్లు	మహిళా ఓటర్లు	ట్రాన్స్ జెండర్	మొత్తం ఓటర్లు
అల్లూరు జిల్లా	12	2,842	1827	0	4669
కోనసీమ జిల్లా	95	37,114	27,355	2	64,471
తూ.గో. జిల్లా	92	36,361	26,606	3	62,970
ఏలూరు జిల్లా	66	24,704	17,571	7	42,282
కాకినాడ జిల్లా	98	42,463	28,072	5	70,504
ప.గో. జిల్లా	93	38,863	30,187	2	70,052
మొత్తం	456	1,83,347	1,31,618	19	3,14,984

ఎన్నికల సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం

రిటర్నింగ్ ఆఫీసర్ వెట్రిసెల్వి

ఏలూరు,ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్సీ ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్ సౌకర్యానికి అవకాశం కల్పించినట్లు తూర్పు-పశ్చిమ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎన్నికల రిటర్నింగ్ అధికారి కె.వెట్రిసెల్వి తెలిపారు. ఈ నెల 27న జరిగె ఎమ్మెల్సీ ఎన్నికల నిమిత్తం ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బంది వారి ఓటు హక్కును పోస్టల్ బ్యాలెట్ ద్వారా వినియోగించుకోవచ్చని అన్నారు. దీనికి ఫారం-12ను జిల్లా రిటర్నింగ్ అధికారి, ఏలూరు జిల్లా కేంద్రానికి ఈ నెల 20వ తేదీ సాయంత్రం 5 గంటల్లోగా సిబ్బంది సమర్పించాలని అన్నారు. సిబ్బంది ఫారం- 12ను ఏలూరు.ఏపీ.జీవో.ఇన్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచిం చారు. ఈ ఫారంతో పాటు డ్యూటీ కేటాయింపు చేసిన ఉత్తర్వులు జిరాక్స్‌లు జతపర్చాలని ఆమె కోరారు.

ప్రజా సమస్యలపై ఎమ్మెల్యే చంటి అర్జీల స్వీకరణ

ఏలూరు టూటౌన్, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలపాలిట సంజీవని వంటిదని ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య(చంటి) అన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం ఎమ్మెల్యే ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చంటి మాట్లాడుతూ గత 8 నెలలుగా నిర్విరామంగా ప్రజాసమస్యలు తెలుసుకుని పరిష్కరిస్తున్నామని అన్నారు. వైసీపీ ప్రభుత్వం ఆరోగ్యశ్రీ డబ్బులను కోట్లరూపాయల మేర ఆసుపత్రులకు ఎగనామం పెడితే కూటమి ప్రభుత్వం చెల్లించి ఆరోగ్యశ్రీ సేవలకు అంతరాయం లేకుండా చూస్తోందన్నారు. కార్యక్రమంలో చల్లా సత్యవరప్రసాద్, చోడే వెంకటరత్నం, పెద్దిబోయిన శివప్రసాద్, వందనాల శ్రీనివాస్, ఆర్ఎస్ఆర్ నాగేశ్వరరావు, చిరంజీవి, తదితరులు పాల్గొన్నారు.

చిన్నారుల చదువుతో పాటు ఆరోగ్య సంరక్షణే లక్ష్యం

పెదవేగి, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి) : చిన్నారులకు పూర్వ ప్రాథమిక విద్యతో పాటు ఆరోగ్య సంరక్షణకు ప్రభుత్వం కృషి చేస్తోందని మహిళా శిశు సంక్షేమ శాఖ పెదపాడు ప్రాజెక్టు సీడీపీవో కె.విజయలక్ష్మి అన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలకు అందిస్తున్న మూడు రోజుల శిక్షణ కార్యక్రమం చివరిరోజు శనివారం పెదవేగిలో జడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. సీడీపీవో విజయలక్ష్మి పాల్గొని పిల్లల అభివృద్ధిపై అవగాహన కల్పించారు. పెదవేగి, విజయరాయి, కొప్పాక సెక్టార్ల సూపర్‌వైజర్లు సీహెచ్.పార్వతి, మేరీబాయి, శాంతారత్నం, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పారిశుధ్యంపై అవగాహన

చింతలపూడి/టి.నరసాపురం, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి) : మండలంలో పలు చోట్ల స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలు మండలంలోని ఎర్రగుంటపల్లి, చింతలపూడిలో పలు చోట్ల నిర్వహించారు. ఎర్రగుంటపల్లిలో పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ నరేష్ మా ట్లాడుతూ గ్రామాల్లో వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. అనంతరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాసరావు విద్యార్థులకు పలు సూచనలు చేశారు. నగర పంచాయతీ ఆధ్వర్యంలో డెస్ట్‌బిన్‌ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్టు నగర పంచాయతీ కమిషనర్ డి.పావని తెలిపారు. టి.నరసాపురం మండల ప్రజా పరిషత్ కార్యాలయాన్ని ఎంపీడీవో మణికుమారి ఆధ్వర్యంలో శుభ్రం చేశారు. స్వచ్ఛాంధ్ర - స్వచ్ఛదివస్‌లో భాగంగా ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ పి.శేఖర్ బాబు, పి.రఘు, శివ, రవి పాల్గొన్నారు.

ఘనంగా సేవాలాల్ జయంతి

ఏలూరు టూటౌన్/చింతలపూడి, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి) : ఎస్టీ బంజార, సుగాలి, లంబాడి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గిరిజన లంబాడ భవన్‌లో లంబాడీల ఆరాధ్యదైవం సంత్‌శ్రీ సేవాలాల్ మహరాజ్ జయంతిని నిర్వహించారు. సంఘ జిల్లా అధ్యక్షులు గగులోతు కృష్ణనాయక్ ఆధ్వర్యంలో శనివారం జరిగిన కార్యక్రమంలో సేవాలాల్ మహరాజ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రభాకర్, భూక్య సోములు, జీ.బాలునాయక్, నాగేశ్వరరావు, రంగనాయక్, బాలాజీ, తారాసింగ్, రాము, ఝాన్సీరాణి, బాలు, తదితరులు పాల్గొన్నారు. చింతలపూడి మారుతీ నగర్‌లో లంబాడీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సేవాలాల్ జయంతిని నిర్వహించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి రాజబాబు నాయక్ రేచర్ల, నామవరం, నాగిరెడ్డిగూడెం, సీతానగరం, వెంకటాపురం, చింతంపల్లి, తలార్లపల్లి గ్రామాల్లో జెండాలను ఆవిష్కరించారు.

ఉచితంగా ఫిజియోథెరపీ సేవలు

ఏలూరు రూరల్, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి):జిల్లా దివ్యాంగుల పునరావాస కేంద్రంలో ఉచిత ఫిజియోథెరపీ సేవలు అందిస్తున్నట్లు కోఆర్డినేటర్ డి.శ్రీనివాస రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. దొండపాడులోని ఉమా ఎడ్యుకేషనల్, టెక్నికల్ సొసైటీ ఆధ్వర్యంలో దివ్యాంగులకు ఉచితంగా ఈ సేవలు అందిస్తోందన్నారు. పక్షవాతం, మూతివంకర, మెడనొప్పి, నడుము, అన్నిరకాల నొప్పులకు ప్రత్యేక యంత్ర పరికరాల ద్వారా చికిత్స అందించనున్నట్టు తెలిపారు. ఫిజియోథెరపీ అవసరమైన వారు 7386565469 నెంబర్లో సంప్రదించాలని కోరారు.

శ్రీవారి ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన

ఏలూరు కార్పొరేషన్, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి) : దొండపాడులోని బాల అయ్యప్ప క్షేత్రం ప్రాంగణంలో గత ఏడాది మే 4వ తేదీన తవ్వకాల్లో శ్రీప్రసన్న వేంకటేశ్వర స్వామి విగ్రహం లభించడంతో అదే ప్రాంతంలో ఆలయాన్ని నిర్మించేందుకు శనివారం శంకుస్థాపనను శాస్త్రోక్తంగా నిర్వహించారు. కార్యక్రమాల్లో ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి, దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్, విశ్వ హిందూ పరిషత్ నాయకులు తపన చౌదరి, ఏలూరు నగర మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబు, ఆర్టీసి విజయవాడ జోన్ చైర్మన్ రెడ్డి అప్పల నాయుడు పాల్గొన్నారు.

పేదల ఆరోగ్య సంరక్షణకే ఉచిత వైద్య శిబిరాలు

పెదవేగి, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి) : పేదల ఆరోగ్య సంరక్షణకు ఉచిత వైద్య శిబిరాలు తోడ్పాటును అందిస్తాయని ఎఫ్‌సీసీ ప్రావిన్స్ సుపీరియర్ సిస్టర్ మరియ థెరిస్సా అన్నారు. ఏలూరు వంగాయగూడెంలోని గుడ్ సమరిటన్ కేన్సర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో జానంపేట పంచాయతీ ప్రకాష్‌నగర్‌లోని ఎఫ్‌సీసీ ప్రావిన్స్ సిస్టర్స్ క్యాంపస్‌లో శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. అన్నిరకాల వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ చంద్ర, డాక్టర్ మౌని, సిస్టర్లు అన్సిన, థెసిన్, పీఆర్‌వో వినీల్, సిబ్బంది పాల్గొన్నారు.

మసాజ్ సెంటర్లను నిషేధించాలి : మహిళా సంఘం

ఏలూరు కార్పొరేషన్, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి) : మార్గదర్శకాలను ఉల్లంఘిస్తూ అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తున్న స్పా, మసాజ్ సెంటర్లను నిషేధించాలని ఏపీ మహిళా సమాఖ్య ఏలూరు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్యామల, యామినిలు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కొందరు వ్యక్తులు ఈజీ మనీ కోసం అడ్డదారులు తొక్కుతున్నారని, మహిళలను బలవంతంగా వ్యభిచార కూపంలోకి లాగి డబ్బులు దండుకుంటున్నారని అన్నారు. పేద, మధ్య తరగతి మహిళలను టార్గెట్ చేసి వారికి ఉద్యోగాలు ఇప్పిస్తామని నమ్మించి వ్యభిచారం చేయిస్తూ అందినకాడికి డబ్బును దండుకుంటున్నారని అన్నారు. ప్రభుత్వం మహిళలకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించి ఆదుకోవాలని, పోలీసుశాఖ స్పా, మసాజ్ సెంటర్లపై దృష్టి సారించి నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

బాలికల రక్షణ కోసం మహిళా రక్షక బృందం

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : మహిళలు, బాలికల రక్షణ కోసం ఏర్పాటు చేసిన అభయ మహిళా రక్షక బృందం మహిళలకు అవగాహన కల్పించారు. ఎస్పీ కెపిఎస్ కిశోర్ జిల్లాలో ఏర్పాటు చేసిన అభయ మహిళా రక్షక బృందం, అభయ వాహనం ద్వారా ప్రజలకు దృశ్య రూపంలో వివిధ కార్యక్రమాలను ఏలూరు మహిళా పోలీస్ స్టేషన్ సీఐ ఎం.సుబ్బారావు, మహిళా ఎస్‌ఐ వి.కాంతిప్రియల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా శనివారం మహిళలకు ఆత్మస్థైర్యం కల్పించారు. అసాంఘిక కార్యకలాపాల నిర్మూలన కోసం నెంబర్ 9550351100కు వాట్సాప్ మెస్సేజ్ చేయాలన్నారు.

జనన, మరణాలను నమోదు చేసుకోవాలి

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి) : జనన మరణాలను తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని, వివాహ పత్రాలను నిర్దిష్ట సమయాల్లో సంబంధిత కార్యాలయాల్లో నమోదు చేసుకుని ధృవపత్రాలను పొందాలని ఏలూరు అదనపు సీనియర్ సివిల్ జడ్జి కె.కె.వి.బుల్లికృష్ణ అన్నారు. ఏలూరు జిల్లా కోర్టు ఆవరణలో ఉన్న డీఎల్ఎస్ఏ భవనంలో జనన మరణాల నమోదు, కుల ధృవ పత్రాలు, వివాహ ధృవపత్రాలు జారీ అంశాలపై సంబంధిత అధికారులకు శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జడ్జి బుల్లికృష్ణ మాట్లాడుతూ ధృవపత్రాలను జారీ చేసే అధికారులు అవసరమైన సూచనలు, నిబంధనలను ప్రతి ఆఫీసులో బహిర్గతం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రిజిస్ట్రార్ కె.శ్రీనివాసరావు, రెవెన్యూ డివిజినల్ అధికారి అంబరీష్, ఏలూరు మున్సిపల్ డిప్యూటీ కమీషనర్ శ్రీనివాసరెడ్డి, ఏలూరు తహసిల్దార్ శేషగిరి, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ టిఎన్‌వి మునేశ్వరరావు పలువురు పాల్గొన్నారు.

న్యాయవాది టీఎస్ఆర్ గుండె పోటుతో మృతి

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : ఏలూరు బార్ అసోసియేషన్ స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెక్రటరీ, ఆంధ్రప్రదేశ్ లీగల్ సర్వీసెస్ అథార్టీ మాస్టర్ ట్రైనర్ తిగిరిపల్లి సుబ్బారావు(64) గుండె పోటుతో శనివారం మరణించారు. తాళ్ళపూడి మండలం పెద్దేవం గ్రామానికి చెందిన తిగిరిపల్లి సుబ్బారావు న్యాయవాదిగా ఏలూరు జిల్లా కోర్టులో ప్రాక్టీసు చేస్తున్నారు. ఆయన సతీమణి కోమలి ఏలూరు కలెక్టరేట్‌లో ఉన్న నీటిపారుదల శాఖలో ఉద్యోగం చేస్తున్నారు. ఆమెను శనివారం ఉదయం కలెక్టరేట్‌లో దించడానికి ఏలూరు అశోక్ నగర్ నుంచి బయలుదేరగా కొంతదూరం వెళ్ళగానే ఆకస్మాత్తుగా ఛాతీ నొప్పికి గురై పడిపోయారు. ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందారు.

మైనర్‌కు నో ఛాన్స్..

18 ఏళ్లు నిండకుండా మోటార్ వాహనాలు నడపొద్దు : ఏఎస్పీ సూర్యచంద్రరావు

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి) : పద్దెనిమిదేళ్ళ వయసు నిండని ఏ ఒక్కరికి మోటార్ వాహనాలను నడిపే హక్కు లేదని ఏలూరు జిల్లా అడిషనల్ ఎస్పీ నక్కా సూర్యచంద్రరావు అన్నారు. ఉప రవాణా కమిషనరు కార్యాలయంలో శనివారం జరిగిన 36వ జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పదవ, ఇంటర్ మీడియట్ చదువుకునే ఎవ్వరికైనా 18 ఏళ్ళు వయస్సు నిండి ఉండదని, వారికి డ్రైవింగ్ లైసెన్సులు జారీ చేయబడదన్నారు. మైనర్లు యాక్సిడెంట్ చేస్తే ఆ వాహన యజమానిపై కేసులు నమోదు చేస్తామన్నారు. తమ పిల్లలు డ్రైవింగ్ లైసెన్సు కలిగి ఉన్నప్పుడు మాత్రమే తల్లి దండ్రులు వాహనాలను వారికి ఇవ్వాలని, హెల్మెట్, సీట్‌బెల్టును ధరించి వాహనాలను నడపాలన్నారు. అతివేగం మానుకోవాలని, నిర్లక్ష్యం వద్దని హితవు పలికారు. వాహనాలను అమ్మిన వెంటనే పత్రాలను కూడా వెంటనే వారి పేరుమీద మార్చుకోవాలన్నారు. లేనిదంటే వాహనానికి ఏదనా ప్రమాదం జరిగితే చిక్కుల్లో పడతారని హెచ్చరించారు. అలాగే ఆటోలో ఎక్కువ మంది ప్రయాణికుల్ని ఎక్కించవద్దని అన్నారు. పత్రాలు సరిగా ఉండేలా చూసుకోవాలని అన్నారు. ఉప రవాణా కమీషనర్ షేక్ కరీమ్ మాట్లాడుతూ ఇంతకు ముందు వారోత్సవాలు జరిగేవని, వాటిని ప్రభుత్వం మాసోత్సవాలుగా మార్చిందని, దానికి కారణం ప్రజలకు మరింత అవగాహన కల్పించడానికి అని తెలిపారు. ఈ 30 రోజుల్లో నిత్యం ఏలూరు జిల్లా వ్యాప్తంగా 50కి పైగా రహదారి భద్రతా అవగాహనా కార్యక్రమాలను నిర్వహించామన్నారు. ఇందులో 25 కళాశాలలు, పాఠశాలల్లో నిర్వహించానని తెలిపారు. విద్యార్థి దశ నుంచే రహదారి భద్రతా నియమాలపై అవగాహన కల్పించడం ద్వారా ప్రమాద రహిత సమాజాన్ని చూడవచ్చని అన్నారు. ఏలూరు, జంగారెడ్డిగూడెం ఆర్టీవోలు కృష్ణారావు, మదానీ మాట్లాడుతూ హెల్మెట్, సీటు బెల్టును ధరించడం, ఓవర్‌లోడ్ చేయకపోవడం, అతివేగం, మద్యం, సెల్‌ఫోన్ డ్రైవింగ్ చేయకపోవడం ద్వారా చాలా ప్రమాదాలు తగ్గుతాయన్నారు. కార్యక్రమంలో గత 27 ఏళ్ళుగా ఒక్క ప్రమాదం కూడా చేయని జిల్లాలోని ముగ్గురు ఆర్టీసీ డ్రైవర్లయిన బి.పాపారావు (నూజివీడు), బి.చెల్లయ్య (ఏలూరు), బి.కృష్ణారెడ్డి (జంగారెడ్డిగూడెం), వివిధ విద్యా సంస్థల బస్సుల డ్రైవర్లకు మెమెంటోలను అందించి జిల్లా అడిషనల్ ఎస్పీ నక్కా సూర్యచంద్రరావు, డీటీసీ షేక్ కరీమ్, ఆర్టీవోలు సత్కరించారు. చిత్రలేఖనం, క్విజ్ పోటీల్లో విజేతలుగా నిలిచి విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ డీఎం వాణి, ఆర్అండ్‌బి బిడిఇసంఘ మిత్ర, రవాణాశాఖ పరిపాలన అధికారులు ఎం.రాము, ఎం ఆనంద్‌కుమార్, వాహన తనిఖీ బి.భీమారావు, జి.ప్రసాదరావు, ఎన్‌డి విఠల్, ఎస్‌బి శేఖర్, ఎస్.జగదీష్, వైఎస్‌వి కల్యాణి, కృష్ణవేణి, పి.నరేంద్రబాబు, డి.ప్రజ్ఞ, ట్రాఫిక్ పోలీస్, రవాణాశాఖ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏఎస్పీ సూర్య చంద్రరావు

గుబ్బల మంగమ్మ ఆలయం వద్ద సోలార్ లైట్లు ఏర్పాటు

బుట్టాయగూడెం, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి) : మన్యం దేవత శ్రీగుబ్బల మంగమ్మ తల్లి ఆలయానికి సికింద్రాబాద్‌కు చెందిన టెల్ టవర్స్ సోలార్ కంపెనీకి చెందిన ప్రతినిధి పి.చైతన్య సుధాకర్ సోలార్ లైట్లను అందజేశారు. ఈ లైట్లను శనివారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రారంభించారు. విద్యుత్ సౌకర్యం లేక భక్తులు ఇబ్బందులు పపడుతున్న విషయాన్ని గుర్తించిన కంపెనీ వారు సోలార్ లైట్లను అందజేయడం అభినందనీయమని ఎమ్మెల్యే చిర్రి బాలరాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో రామలక్ష్మణ్ సోషల్ ఆర్గనైజేషన్ సొసైటీ డైరెక్టర్ కుంజా నాగరాజు, సర్పంచ్ కోర్స గంగరాజు, చిర్రి కృష్ణ, పి.లలితా హరిక, లక్ష్మీబాబు, కిషోర్, గోవింద్, జస్వంత్, సత్యన్నారాయణ రాజు, బుచ్చిరాజు, బాలునాయక్, పి.కన్నపరాజుదొర పాల్గొన్నారు.

అమ్మవార్లను దర్శించుకున్న ఎమ్మెల్యే దంపతులు

బుట్టాయగూడెం, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి) : కామవరంలో జరుగుతున్న గద్దె రాజుల మాఘ శుద్ధ పౌర్ణమి గిరిజన జాతర మహోత్సవాల్లో శనివారం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు దంపతులు దుర్గమ్మ, గుబ్బల మంగమ్మ, నాగదుర్గాదేవి అమ్మవార్లను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా గిరిజన కళాకారులతో కలిసి ఎమ్మెల్యే దంపతులు సాంప్రదాయ నృత్యాలు చేశారు. ఆలయ పీఠాధిపతి వర్స పుల్లారావు అమ్మవార్లకు ప్రత్యేక పూజలు జరిపించారు. గిరిజన సంస్కృతి, సాంప్రదాయాలు కనుమరుగు కాకుండా ఉండాలంటే ఇటువంటి జాతరలు ఎంతగానో సహకరిస్తాయని తెలిపారు.

కూటమి అభ్యర్థి పేరాబత్తులను గెలిపించాలి

నిడమర్రు ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి) : కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరంను ఉపాధ్యాయులు, గ్రాడ్యుయేట్లు మొదటి ప్రాధాన్యతా ఓటు వేసి గెలిపించాలని ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు, మాజీ ఎమ్మెల్యే గన్ని వీరాంజనేయులు అభ్యర్థించారు. నిడమర్రు మండలం పెదనింద్రకొలను, అడవికొలను, నిడమర్రు ఉన్నత పాఠశాలలను సందర్శించి ఉపాధ్యాయ గ్రాడ్యుయేట్ ఓటర్లను ఓట్లు అభ్యర్థించారు. ఈ కార్యక్రమం కూటమి నాయకులు చింతలపాటి బాసిరాజు, నిమ్మల దొరబాబు, సంకు నాగేషు, ముత్యాల స్వామి, తదితరులు పాల్గొన్నారు.

పట్టభద్రులతో మాజీ ఎమ్మెల్యే భేటీ...

కామవరపుకోట : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరంను మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని చింతలపూడి మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళీ రామకృష్ణ పిలుపునిచ్చారు. మండలంలోని పలు గ్రామాల్లో ఆయన పట్టభద్రులను కలుసుకుని కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించి అందుకు మద్దతుగా రాజశేఖర్‌ను గెలిపించాలంటూ కోరారు.

చింతలపూడిలో బీజేపీ సమావేశం..

చింతలపూడి: పట్టభద్రుల ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరంను గెలిపించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు సి.హెచ్.విక్రమకిశోర్ పిలుపునిచ్చారు. శనివారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో సమావేశంలో మాట్లాడుతూ బూత్ స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయాలని, క్షేత్రస్థాయిలో ప్రజల్లోకి వెళ్లాలని, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం ప్రయత్నాలు చేయాలని కార్యకర్తలకు సూచించారు. ఈ కార్యక్రమాల్లో నాయకులు ఒంటెద్దు ప్రసాద్, తోట నారాయణ, చక్రధరరావు, విజయకుమారి, సింగం ప్రసాద్, తాటిపర్తి శ్రీనివాస్, మోహన్‌రావు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సొంగా ఆధ్వర్యంలో..

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ ప్రగడవరం జడ్పీ పాఠశాలలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ కూటమి అభ్యర్థి రాజశేఖరంను గెలిపించాలని ఉపాధ్యాయులు, విద్యార్థులకు పిలుపునిచ్చారు.



ప్రగడవరంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సొంగా

ఈకార్యక్రమంలో టీడీపీ నాయకులు జె.ముత్తారెడ్డి, జనసేన నాయకులు చీదరాల మధుబాబు, టి.వి. నారాయణ, కూటమి నాయకులు పాల్గొన్నారు.

కూటమి అభ్యర్థి గెలుపు ఖాయం : చంటి

ఏలూరు టూటౌన్ : ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరం విజయం ఖాయమని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. శనివారం ఎమ్మెల్యే చంటి బృందం కార్పొరేట్ కళాశాలలో ప్రచారం నిర్వహించారు. ఎన్ఆర్ఐ చైతన్య కళాశాలలో జరిగిన సమావేశంలో చంటి మాట్లాడుతూ ఉద్యోగుల, ఉపాధ్యాయుల, గ్రాడ్యుయేట్‌ల సమస్యలు పరిష్కారం కావాలంటే రాజశేఖరాన్ని ఎమ్మెల్సీ అభ్యర్థిగా గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే చింతమనేని ప్రచారం..

పెదవేగి : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి బలపర్చిన అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరంను మొదటి ప్రాధాన్యత ఓటుతో గెలిపించాలని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ఓటర్లను అభ్యర్థించారు. దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరం గెలుపు కోరుతూ పట్టభద్రుల ఓట్లను అభ్యర్థిస్తూ పెదవేగి మండలంలో శనివారం విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా నడిపల్లిలో జరిగిన ఎన్నికల ప్రచారంలో ప్రభాకర్ మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థి విజయంతో రాష్ట్ర ప్రగతికి మరింత బలం చేకూరుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు బొప్పన సుధాకర్, తాతా సత్యనారాయణ, లావేటి శ్రీనివాసరావు, మోరు శ్రావణి, పెనుబోయిన మహేష్ యాదవ్, జనసేన నాయకుడు కొఠారు ఆదిశేషు పాల్గొన్నారు.

మా మనోభావాలు దెబ్బతీయొద్దు

ఐ.వి.ఆర్.ఎస్ సర్వేపై వీఆర్వోల అసహనం

ఏలూరు రూరల్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : వీఆర్వోలను కించపర్చేలా ఐ.వి.ఆర్.ఎస్ సర్వే పేరుతో ఫోన్లు చేయడం సరికాదని రాష్ట్ర గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు భూపతిరాజు రవీంద్ర రాజు, ప్రధాన కార్యదర్శి ఎం.అప్పలనాయుడు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఐ.వీ.ఆర్.ఎస్ ద్వారా ఫిర్యాదు దారుడికి ఫోన్ చేసి పరిష్కారం చేశారా? ఎవరైనా డబ్బులు అడిగారా? అంటూ ఐ.వి.ఆర్.ఎస్ సర్వే ద్వారా ఉద్యోగుల మనోభావాలు దెబ్బతినేలా ప్రశ్నలు వేయడం సరికాదన్నారు. ఐ.వి.ఆర్.ఎస్ సర్వేలో కొంతమందికి తెలిసో తెలియకో ఏదోఒక బటన్ నొక్కితే దాని ఆధారంగా కింది స్థాయి ఉద్యోగులకు మెమోలిచ్చి ఉద్యోగులను సస్పెండ్ చేస్తామనడం సరికాదన్నారు. విపరీతమైన ఒత్తిడిచేసి రీసర్వే తప్పుడు తడకలుగా గత ప్రభుత్వంలో జరిగిందన్నారు. రీసర్వే పేరుతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని, ప్రస్తుతం అధికారులు కూడా పాత విధానాన్నే కొనసాగిస్తున్నారని మండిపడ్డారు. ఐ.వి.ఆర్.ఎస్ సర్వేపేరుతో ఉద్యోగులపై చర్యలు తీసుకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేస్తామన్నారు.



అదనపు వసతి గదుల నిర్మాణానికి అందజేస్తున్న విరాళం

వసతి గదుల నిర్మాణానికి విరాళం

ఏలూరు, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి) : జంగారెడ్డిగూడెం మండలం గురవాయిగూడెం మద్ది ఆలయ ప్రాంగణం వద్ద దాతల సాయంతో డోనార్స్ స్కీంలో నిర్మిస్తున్న వసతి గదుల నిర్మాణానికి భారీ విరాళం అందింది. హైదరాబాదుకు చెందిన భక్తులు మహేందర్, శ్రీలత దంపతులు రూ.పది లక్షల చెక్కును విరాళంగా ఈఓ ఆర్.వి.చందనకు శనివారం అందజేశారు. అనంతరం మద్ది అంజనేయ స్వామికి వేకువ జాము నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ముఖ మండపంపై ఉత్సవ మూర్తికి ఆలయ అర్చకులు పంచామృత అభిషేకాలు నిర్వహించారు.



పరిసరాలు శుభ్రం చేస్తున్న అధికారులు

పరిసరాలు శుభ్రంగా ఉండాలి

ఏలూరుసిటీ, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి) : పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి జీవితంలో భాగం కావాలని జిల్లా జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి పిలుపునిచ్చారు. స్వచ్ఛాంధ్ర- స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా శనివారం కలెక్టరేట్‌లోని పరిసరాలను కలెక్టరేట్ సిబ్బందితో కలిసి జెసి శుభ్రం చేశారు. ఈ సందర్భంగా జెసి పి.ధాత్రిరెడ్డి మాట్లాడుతూ పరిశుభ్రతతో రోగాలు దరిచేరకుండా ఉంటాయని, వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత కూడా ప్రతి ఒక్కరి జీవితంలో భాగం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి వి విశ్వేశ్వరరావు , కలెక్టరేట్ పరిపాలనాధికారి నాంచారయ్య పాల్గొన్నారు.

వ్యవసాయశాఖాధికారి కార్యాలయంలో : స్వచ్ఛ ఆంధ్ర- స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా శనివారం జిల్లా వ్యవసాయశాఖాధికారి వారి కార్యాలయంలో పరిసరాలను శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖాధికారి షేక్ హబీబ్ బాషా స్వయంగా చీపురుపట్టి చెత్తను శుభ్రం చేశారు. ఉంచాలని జిల్లా వ్యవసాయ శాఖాధికారి హబీబ్ బాషా వారి సిబ్బందికి సూచించారు.



క్లాప్ కొడుతున్న మాజీ ఎమ్మెల్యే అంబికా కృష్ణ

ధర్మాజీగూడెంలో సినిమా షూటింగ్


లింగపాలెం, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి) : మండలంలోని ధర్మాజీగూడెంలో సాయినందన్ ప్రొడక్షన్‌లో నూతన నటీనటులతో పెళ్లిరోజు అనే సినిమా షూటింగ్ ప్రారంభించారు. ఈ సినిమా షూటింగ్‌ను మాజీ ఎమ్మెల్యే అంబికా కృష్ణ క్లాప్ కొట్టి ప్రారంభించారు. ప్రతి కుటుంబంలోని బంధాలు బాంధవ్యాలను ముఖ్య అంశంగా తీసుకుని ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నట్లు సినీదర్శకుడు, నిర్మాత సురేష్ తెలిపారు. లింగపాలెం, చింతలపూడి మండలాల్లో మూడు రోజుల పాటు ఈ సినిమా చిత్రీకరణ ఉంటుందని తెలిపారు. ఈ సినిమాలో సాయి, సుమ హీరో, హీరోయిన్‌లుగా నటిస్తున్నట్లు తెలిపారు.

వంకర పాదాలకు విజయవంతంగా శస్త్రచికిత్స

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : పుట్టుకతో వచ్చే వంకర పాదాల వ్యాధి కల్గిన ఒక శిశువుకు ఏలూరు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో శస్త్ర చికిత్స విజయవంతంగా నిర్వహించినట్లు ప్రభుత్వాసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎంఎస్ రాజు తెలిపారు. మేదినరావుపాలెం గ్రామానికి చెందిన శ్రావణి, శాంతిరాజు దంపతులకు నాలుగు రోజుల క్రితం వంకరపాదాల వ్యాధితో శిశువు జన్మించింది. ఈ విషయాన్ని గమనించిన ఏలూరు ప్రభుత్వాసుపత్రి వైద్యులు శస్త్ర చికిత్సలు నిర్వహించడానికి తక్షణం చర్యలు చేపట్టారు. ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎంఎస్‌రాజు పర్యవేక్షణలో ఎముకుల వైద్య నిపుణులు డాక్టర్ నాగరాజు, డాక్టర్ నవ్య, మత్తు వైద్యులు, నర్సులు, థియేటర్ సిబ్బంది. డిప్యూటీ వైద్యులు బృందం కలిసి ఆపరేషన్ శనివారం నిర్వహించి విజయవంతం చేశారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ ఏలూరు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో ప్రతి గురువారం 13వ నెంబర్ ఓపీలో వంకరపాదాల వ్యాధి చికిత్స కోసం ప్రత్యేక విభాగపు పరీక్షలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. చిన్నారికి వైద్యం చేసిన బృందాన్ని డిప్యూటీ వైద్యులు వంశీ, ధన్యశ్రీలు అభినందించారు.



చికిత్స చేసిన వైద్య బృందం(ఇన్‌సెట్‌లో చిన్నారి పాదం)



స్థూపంలో సాయికోటి పుస్తకాలను వేస్తున్న భక్తులు

శ్రీసాయి మహాస్థూపం వార్షికోత్సవం

పెదవేగి, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి) : పెదవేగి మండలం లక్ష్మీపురం గార్డెన్స్‌లోని వరలక్ష్మి శ్రీసాయికోటి మహాస్థూపం వార్షికోత్సవం శనివారం వైభవంగా జరిగింది. ఉదయం కాగడ హారతి, సుప్రభాత సేవ, పుష్పాభిషేకం నిర్వహించారు. శనివారం ఉదయం నుంచే బాబా దర్శనం కోసం భక్తులు బారులు తీరారు. శ్రీసాయి కోటి మహా స్థూపం 27వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని వారం రోజులుగా అఖండ సాయినామ సంకీర్తన, సాయి సేవకుల సత్సంగ ప్రసంగాలు నిర్వహించారు. భారీ సంఖ్యలో భక్తులు రావడంతో పెదవేగి సీఐ కె.వెంకటేశ్వరరావు సూచనలతో ఎస్ఐ కె.రామకృష్ణ బందోబస్తు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

జిల్లాలో పోలీస్ తనిఖీలు

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : జిల్లా ఎస్పీ కిశోర్ ఆదేశాల మేరకు జిల్లాలో శనివారం సాయంత్రం నుంచి రాత్రి 7 గంటల వరకూ వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో విజిబుల్ పోలీసింగ్ నిర్వహించారు. జిల్లాలోని ప్రధాన రహదారులు, కూడళ్ళల్లో పోలీసులు వాహనాల తనిఖీ చేసి ప్రజలకు హెల్మెట్ ధారణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులు మాట్లాడుతూ ప్రతి వాహనదారుడు లైసెన్సు కల్గి ఉండాలని, వాహనానికి సంబంధించిన అన్ని రికార్డులు వాహనంతోపాటే ఉండాలన్నారు. ద్విచక్రవాహనం నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు ఎక్కువ మంది ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ లేకపోవడం వల్ల తలకు దెబ్బ తగిలి మరణించారని ఈనేపథ్యంలో ఖచ్చితంగా ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించడం వల్ల ప్రాణాలు కాపాడుకోవచ్చన్నారు. హెల్మెట్‌ను భారంగా భావించొద్దని ప్రాణాలు కాపాడే రక్షక కవచమని సూచించారు. సరైన రికార్డులు లేనిపలువురికి ఇ చలానాలు విధించారు.

ఇంటర్ ప్రాక్టికల్స్ ప్రశాంతం

ఏలూరు అర్బన్, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి) : ఇంటర్ జనరల్, ఒకేషనల్ ప్రాక్టికల్స్ పరీక్షల్లో భాగంగా శనివారం ఉదయం జరిగిన పరీక్షలకు 1641మంది విద్యార్థులకు 1573మంది, మధ్యాహ్నం 1456మందికి 1422మంది హాజరయ్యారని ఆర్ఐవో కె.యోహాన్ తెలిపారు.

రామభక్తులకు అన్నదానం

కుక్కునూరు, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా సామార్లకోట నుంచి భద్రాచలం వరకు పాదయాత్ర చేస్తున్న 200మంది భక్తులు శనివారం కుక్కునూరు చేరుకున్నారు. స్థానిక గ్రామాల్లోని రామాలయం నుంచి కుక్కునూరు వరకు శ్రీరామరథోత్సవంలో పాల్గొన్నారు. అలాగే టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు నాగేశ్వరరావు ఆధ్వర్యంలో 210మంది భక్తులు అల్పాహారం, భోజన వసతి ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కోటగిరి సత్యనారాయణ, ఉపసర్పంచ్ పిచ్చుక రాజు, రమణరాజు, జనసేన మండల పార్టీ అధ్యక్షుడు ఎం.యుగంధర్, వెంకన్నబాబు పాల్గొన్నారు.

జన్మ నక్షత్ర పూజలు

కామవరపుకోట, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి) : అయ్యప్పస్వామి జన్మ నక్షత్రం ఉత్తరానక్షత్రం సందర్భంగా శనివారం స్థానిక వీరభద్రస్వామి ఆలయ ప్రాంగణంలో శనివారం వీరభద్ర స్వామి అన్నదాన కమిటీ, ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో అయ్యప్పస్వామి విగ్రహానికి, చిత్రపటాలకు అభిషేకాలు, అర్చనలు, పుష్పార్చనలు, కుంకుమార్చనలు నిర్వహించారు. కార్యక్రమంలో అయ్యప్ప భక్తులు బూరగాన శ్రీనివాస్, కడిపి పాపారావు, కెసరి రఘుపతిరెడ్డి, ముప్పంగి శ్రీనివాస్, కానూరు సతీష్, వీరమళ్ళ మధు, చేబోలు మహేష్ పాల్గొన్నారు.

నేడు అన్నప్రసాద వితరణ

ఏలూరు కార్పొరేషన్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : స్థానిక పవరుపేట స్టేషన్ రోడ్డులోని శ్రీధన్వంతరి వైద్య భగవానుని ఆలయం వద్ద ఈనెల 4 నుంచి 6వ తేదీ వరకు రథ సప్తమి మహోత్సవాలు ఘనంగా ముగిసిన నేపథ్యంలో ఆదివారం ఆలయ ప్రాంగణంలో భక్తులకు మహా అన్నప్రసాద వితరణను ఏర్పాటు చేశామని ఆలయ కమిటీ చైర్మన్ కోరాడ రెడ్డి, ఈవో కలగర శ్రీనివాస్‌లు తెలిపారు.

సీఎస్ఐ చర్చి ప్రారంభం

లింగపాలెం, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): క్రీస్తు బోధనలు అనుసరణీయమని చింతలపూడి ఎమ్మెల్యే రోషన్‌కుమార్ అన్నారు. మండలంలోని అన్నపునేనివారిగూడెంలో సీఎస్ఐ చర్చి ప్రారంభోత్సవ కార్యక్రమంలో కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఏసుక్రీస్తు వలే శాంతి, ప్రేమ, జాలి, కరుణ కలిగి ఉండాలన్నారు. అనంతరం గ్రామంలో ఇటీవల మరణించిన కర్లపూడి నిర్మలజ్యోతి కుటుంబసభ్యులను పరామర్శించారు.

ఆలయానికి విరాళం

పోలవరం, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి) : పోలవరం మండలం గూటాల లక్ష్మీనరసింహ స్వామి ఆలయ పునర్నిమాణానికి తూర్పు గోదావరి జిల్లా తాడిపూడి గ్రామస్థులు నామా కొండబాబు 25 వేల రూపాయలు విరాళంగా ఇచ్చినట్లు శనివారం ఆలయ కమిటీ సభ్యులు సింహాద్రి ప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా దాతలకు ఆలయ మర్యాదలతో ఆలయ జ్ఞాపికతో సన్మానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అగ్నికి తాటాకిల్లు ఆహుతి

బుట్టాయగూడెం, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి) : మండలంలోని అంతర్వేదిగూడెం గ్రామంలో శనివారం సాయంత్రం జరిగిన అగ్నిప్రమాదంలో చోడెం రాంపండు, దేవకిలకు చెందిన తాటాకు ఇల్లు పూర్తిగా కాలిపోగా కుటుంబం కట్టుబట్టలతో రోడ్డున పడింది. ప్రమాదంలో పోలానికి చెందిన కాగితాలు, రేషన్, ఆధార్ కార్డులు, పిల్లలకు సంబంధించిన కాగితాలు, బిరువా, వంటసామగ్రి, 20 వేల రూపాయల నగదు కాలిపోయినట్లు బాధితులు తెలిపారు. ప్రమాదం జరిగిన సమయంలో కుటుంబ సభ్యులు పొలం పనులు చేసుకుంటున్నారు. గ్రామస్తులు ఇల్లు కాలిపోతుందని ఫోన్ ద్వారా సమాచారం ఇవ్వడంతో పరుగున వచ్చారు. అప్పటికే ఇల్లు మొత్తం కాలి బూడిదైంది.

పౌష్టికాహారంపై అవగాహన

కొయ్యలగూడెం, ఫిబ్రవరి15 (ఆంధ్రజ్యోతి): పౌష్టికాహారంపై అంగన్వాడీలకు అవగాహన కల్పించారు. ఈ మేరకు స్థానిక జడ్పీ హైస్కూల్‌లో గత మూడురోజులుగా 79మంది అంగన్వాడీ కార్యకర్తలకు శిక్షణ ఇచ్చినట్లు సూపర్‌వైజర్లు అంబటి సరస్వతి, వెంకాయమ్మలు తెలిపారు. వెయ్యి రోజులు సంరక్షణ ప్రీస్కూల్ డెవలప్ మెంట్స్, రక్తహీనత, డిజబులిటీ లక్షణాలు, వంటి వాటికి తీసుకోవల్సిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పించామని తెలిపారు. ఈ శిక్షణా తరగతుల్లో 79మంది అంగన్వాడీ టీచర్లు సిబ్బంది పాల్గొన్నారు.

కవలలకు మెరుగైన వైద్యం

కొయ్యలగూడెం, ఫిబ్రవరి15 (ఆంధ్రజ్యోతి) : నెలలు నిండని కవల పిల్లలకు కొయ్యలగూడెం ఆరోగ్య ఆసుపత్రి వైద్యులు మెరుగైన వైద్య సేవలందించారు. శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలను డాక్టర్లు వెల్లడించారు. బుట్టాయగూడెం మండలం ఉప్పరెల్లి గ్రామానికి చెందిన గిరిజన మహిళ ఇద్దరు కవలలు జన్మించా రు. అయితే ఊపిరితిత్తుల సమస్య ఉండటంతో మెరుగైన వైద్యం అందించారు. దీంతో తల్లిపిల్లలిద్దరూ ఆరోగ్యంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.

షార్ట్ సర్క్యూట్‌తో తోట దగ్ధం

లింగపాలెం, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో లింగపాలెం మండలంలో జామాయిల్ తోట దగ్ధమైంది. మండలంలోని అన్నపునేనివారిగూడెంలో షార్ట్ సర్క్యూట్‌తో ఆలపాటి శేషగిరిరావు, ఆలపాటి పూర్ణచంద్రరావులకు చెందిన జామాయిల్ తోట, జీడిమామిడి చెట్లు దగ్ధమయ్యాయి. పంట చేలు బూడిదవడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


బాబా విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా హోమం నిర్వహిస్తున్న దృశ్యం

వైభవంగా గణపతి హోమం

మండవల్లి ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): మండవల్లిలో నూతనంగా నిర్మించిన షిర్డీ సాయిబాబా సంకీర్తన మందిరం వద్ద శనివారం వైభవంగా గణపతి పూజ, అగ్ని ప్రతిష్ఠాపన, హోమం నిర్వహించారు. భట్లపెనుమర్రుకు చెందిన పండితులు పరాశరం కృష్ణప్రసాద్, ఆయన శిష్యబృందంచే తోరణ బంధన, పుణ్యాహం, అఖండ దీపారాధన, దీక్షాధారణ, అంకురార్పణ పూజలు జరిపారు. విగ్రహ ప్రతిష్ఠ చేయనున్న విఘ్నేశ్వరుడు, దత్తాత్రేయుడు, సాయిబాబా విగ్రహాలకు భక్తులు క్షీరాభిషేకం చేశారు.

గంగానమ్మ ఆలయ పునర్నిర్మాణం

ముదినేపల్లి, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): గురజలోని గంగానమ్మ ఆలయ పునర్నిర్మాణ పనులను గ్రామస్థులు చేపట్టారు. సుమారు రూ.50 లక్షల దాతల విరాళాలతో పునర్నిర్మిం చనున్నారు. అర్చకులు శనివారం హోమ కార్యక్రమాలు నిర్వహించి అమ్మవారిని వేరే చోట తాత్కాలికంగా ప్రతిష్ఠించారు.


మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

కలిదిండి, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): కోరుకొల్లు పంచాయతీ పరిధి బొబ్బిలిగూడెంకు చెందిన గంజాల మల్లయ్యస్వామి తాటాకిల్లు శనివారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైంది. సుమారు రూ.1.50 లక్షల నష్టం వాటిల్లింది. బంగారం, వెండి ఆభరణాలు, నగదు, దుస్తులు, సామగ్రి కాలి బూడిదయ్యాయి. అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు. బాధితులు కట్టుబట్టలతో మిగిలారు. వీఆర్వో రాజబాబు ఘటనా స్థలాన్ని పరిశీలించారు.



మండవల్లిలో జరుగుతున్న డ్రెయినేజీ, కల్వర్టు పనులు

మండవల్లిలో శరవేగంగా హైవే పనులు

మండవల్లి ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): మండవల్లిలో 165వ జాతీయ రహదారి విస్తరణ పనుల్లో రెండు రోజులుగా వేగం పెంచారు. కొన్ని నెలలుగా ఆగిన పనులు తిరిగి మళ్లీ ప్రారంభించారు. మండవల్లిలో వెలమపేటవద్ద కల్వర్టు, డ్రెయినేజీ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. మండవల్లిలో సుమారు రెండు కిలోమీటర్ల పొడవులో ఒకవైపు రోడ్డు నిర్మాణం జరిగింది. కైకలూరు సందు నుంచి ఇండియన్ బ్యాంక్‌పై వరకు ఒక వైపు రోడ్డు నిర్మాణం జరగలేదు. నిర్మాణం కోసం సుమారు 45 రోజుల క్రితం రెండు మూడు మీటర్ల లోతులో మట్టిన తవ్వి (తొలగించి) నేటికీ నిర్మాణం పూర్తి చేయకపోవడంతో డ్రెయినేజీ మురుగునీరు చేరి కాల్వలా మారింది. బయటకు పోయే మార్గం లేక నిల్వ ఉండడంతో దుర్వాసనతో స్థానికులు గగ్గోలు పెడుతూ రోడ్డుపై నిరసన తెలిపారు. ఎన్‌హెచ్ డీఈ సత్యనారాయణ స్పందించి కాంట్రాక్టర్‌ను అప్రమత్తం చేయడంతో ఈ ప్రాంతంలో డ్రెయినేజీ నిర్మాణం, కల్వర్టు పనులను రెండు రోజుల నుంచి ముమ్మరంగా జరుగుతున్నాయి.

కునుకు కరువాయె !

ఆంధ్రజ్యోతి సండే స్పెషల్



ఇదివరకు పొద్దుగూకితే చాలు పల్లెలన్నీ పడకేసేవి..ఎనిమిదింటికే జనం మంచాల పైకి చేరి కునుకు తీసేవారు..ఇప్పుడలా కాదు..రాత్రి పది దాటినా ఇళ్లల్లో లైట్లు వెలుగుతూనే ఉంటున్నాయి..పట్టణాల్లో అయితే అర్ధరాత్రి దాటినా నిద్రలోకి వెళ్లడం లేదు.. టీవీలు, ఫోన్లు కారణంగా పట్టణం పల్లె తేడా లేకుండా అంతా నిద్ర మాట మరిచిపోతున్నారు..నిద్రలేమి వల్ల అనేక ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి..



తాడేపల్లిగూడేనికి చెందిన సుభాష్ స్థానికంగా ఒక ఫ్యాక్టరీలో పనిచేస్తున్నారు. రోజూ ఉద్యోగంలో 10 గంటల పాటు సిస్టమ్‌పైనే వర్క్ చేసి ఇంటికి తిరిగి వచ్చి ఇంట్లో సెల్ ఫోన్ చూస్తూ సేద తీరుతాడు. రాత్రి 12 గంటల వరకూ ఫోన్‌లో మునిగి తేలతాడు. పడుకుందామంటే ఎంతకీ నిద్ర రాకపోతే మళ్లి సెల్ ఫోన్‌లో రీల్స్ చూస్తూనే ఉంటాడు. చివరికి అర్ధరాత్రి 2 గంటలకు నిద్రలోకి జారుకుటాడు. ఉదయం 8 గంటలకు నిద్రలేచి మళ్లి ఉద్యోగానికి వెళ్లాలి. రోజులో ఆరు గంటలే సుభాష్ నిద్ర. దీంతో సరిగా ఆకలి లేక, తలనొప్పి, ఉద్యోగ టెన్షన్‌లో మరింత ఒత్తిడి... ఇవన్నీ కలిసి అతని ఆరోగ్యాన్ని తీవ్రంగా పాడుచేశాయి. దీంతో అసలు నిద్ర ఎందుకు పడటం లేదని వైద్యులను సంప్రదిస్తే సెల్‌ఫోన్ ఒక కారణమైతే, పనిఒత్తిడి మరో కారణమని వెంటనే దినచర్య మార్చుకోవాలని సూచనలు ఇచ్చారు. సుభాష్ తన దినచర్యను కొద్దికొద్దిగా మార్చుకుని రాత్రి 11 గంటలకు పడుకోవడం, ఉద్యోగం నుంచి ఇంటికి వచ్చాక వ్యాయామం చేయడం ప్రారంభించాడు. దీంతో తన తలనొప్పి, ఆకలి లేకపోవడం తదితర సమస్యలు క్రమంగా పరిష్కారమయ్యాయి.

నిద్రలేమి సమస్య ఒక్క సుభాష్‌కే పరిమితం కాదు. ఇటు చదువుకునే విద్యార్థుల నుంచి ఉద్యోగం చేసే వారి వరకూ ఈ సమస్య వెంటాడుతోంది. సెల్‌ఫోన్ వ్యసనంగా మారడం, మరో పక్క టీవీకి అతుక్కుపోవడం వల్ల నిద్ర సరిగా పట్టడం లేదనే మాట చాలామంది నుంచి వినిపిస్తోంది. ముఖ్యంగా పట్టణ వాసుల్లో ఈ పరిస్థితి మరింత ఎక్కువగా కనిపిస్తోంది. సుమారు 47 శాతం మంది నిద్రలేమితో బాధపడుతున్నారని సర్వేలు చెబుతున్నాయి. వాటిలో 12 శాతం మంది భయంకరమైన నిద్రలేమితో ఇబ్బంది పడుతున్నట్టు లెక్కలు వెల్లడిస్తున్నాయి. నిద్రలేమి వల్ల తలనొప్పి, అలసట, ఏకాగ్రత కోల్పోవడంతో పాటు ఎక్కువ మంది దంపతుల్లో కనిపిస్తున్న సంతాన సమస్య, ఆకలి లేకపోవడం తదితర సమస్యలు వస్తున్నట్టు నిపుణులు వివరిస్తున్నారు.

నిద్రలేమితో అనేక సమస్యలు

ఆనందకరమైన జీవనానికి సుఖ నిద్ర అవసరం. గాఢనిద్రతో పాటు ఎంతసేపు నిరంతరాయంగా పడుకున్నారనేది ఆధారపడి ఉంటుందని వైద్యులు చెబుతున్నారు. నిద్రలేమిపై హైద్రాబాద్‌లోని ఏఐజీ సంస్థ ఇటీవల నిర్వహించిన ఓ సర్వేలో ఆశ్చర్యకరమైన నిజాలు వెలుగు చూశాయి. నిద్రలేమి వల్ల గుండెబలహీన పటడం, నరాలు పటుత్వం కోల్పోవడం, జ్ఞాపకశక్తి తగ్గిపోవడం, ఆకలి కోల్పోవడం, అధిక బరువు తదితర సమస్యలు వస్తున్నట్టు వెల్లడించారు. నిద్రలేమి నుంచి ఎంత త్వరగా బయట పడితే ఆరోగ్యానికి అంత మంచిదని సూచిస్తున్నారు.

సమస్య మొదలయ్యేది ఇలా..

సరదాగా ఆటవిడుపు కోసం ప్రారంభించే సెల్‌ఫోన్ వాడకం. క్రమేకి ఒక వ్యసనంగా మారుతోంది. రాత్రి 12 గంటల వరకూ సెల్‌ఫోన్‌లో మునిగిపోవడం సర్వసాధారణం అయింది. దానికంటే ముందుకు వెళ్లి 2 గంటల వరకూ ఫోన్‌తోనే కాలక్షేపం చేస్తున్నారు. ఎంత పనిచేసి వచ్చినా పడు కునే సమయంలో ఫోన్ చూడటం చాలా మందికి దినచర్యగా మారిపోయింది. మన ఆరోగ్యం నిద్రతోనే అని తెలిసినా ఫోన్ తీసి పక్కన పెట్టలేని పరిస్థితి. ప్రస్తుతం రిలీజైన సినిమాలు కూడా ఫోన్‌లలో ప్రత్యక్షం కావడం ఇంటర్నెట్ విరివిగా వాడటంతో సెల్‌ఫోన్ భయంకరమైన వ్యసనంగా మారి పోయింది.

ఏం చేయాలి..?

నిద్ర మనిషి శారీరక, మానసిక ఆరోగ్యానికి దివ్యౌషధం. ఎంత పనిఒత్తిడిలో ఉన్నా నిర్దిష్ట నిద్ర సమయాన్ని కేటాయించుకోవడం చాలా అవసరం. మనల్ని మనం నియంత్రించుకోగలిగితే నిద్రను ఆహ్వానించుకోవచ్చు. ఎన్ని సమస్యలు ఉన్న నిద్ర తరువాతే అన్న ఆలోచన అవసరం. యోగా, మెడిటేషన్ ఇందుకు ఉపయోగపడతాయి. ఎట్టి పరిస్థితుల్లో మత్తుకలిగించే మాత్రలు, పదార్థాలకు అలవాటు పడకూడదు. నెమ్మదిగా వంద అంకెలు ఏకాగ్రతతో లెక్కపెడితే నిద్రవచ్చే అవకాశాలు ఎక్కువని నిపుణులు సూచిస్తున్నారు. మనసులోకి ఎలాంటి ఆలోచనలు రాకుండా చూసుకోవడం మంచిది. రాత్రి 9,10 గంటల తరువాత ఫోన్ జోలికి వెళ్లకుండా ఉండటం ఉత్తమం. సెలవుల్లో తప్ప ఆన్‌లైన్‌లో సినిమాలు, ఓటీటీ వెబ్‌సిరీస్‌ల జోలికి వెళ్లకూడదు.

- తాడేపల్లిగూడెం రూరల్ (ఆంధ్రజ్యోతి)

సెల్‌ఫోన్ అంటే ఓ బాంబ్



ఉద్యోగంలో పని ఒత్తిడిని అధిగమించేందుకు సెల్‌ఫోన్ ఎక్కువగా వాడుతుంటాను. పిల్లలు కూడా ఆటలు, వీడియోలకు అలవాటు పడి ఎక్కువ సమయం ఫోన్లు, టీవీలతో కాలక్షేపం చేస్తున్నారు. తలపోటు, ఆకలి లేకపోవడం వంటి సమస్యలతో ఇబ్బంది పడుతున్నాం. మా ఇంట్లో సెల్ ఫోన్ వాడకం తగ్గించాక మాకు, పిల్లలకు ఆరోగ్య సమస్యలు తగ్గాయి. సెల్‌ఫోన్ అంటే పక్కలో బాంబ్ లాంటిదే.

- ఎం.నాగరాజు, సాఫ్ట్‌వేర్ ఉద్యోగి, టీపీ గూడెం

రోజూ 8 గంటలు నిద్ర అవసరం



నిద్రలేమి వల్ల మెటబాలిజమ్ ఆగిపోతుంది. అరుగుదల తగ్గిపోయి మలబద్ధకం వస్తుంది. మనలో ఏకాగ్రత దెబ్బతింటుంది. నరాల బలహీనత మొదలవుతుంది. కిడ్నీలపై భారం పడి బీపీ, షుగర్ వ్యాధులు వచ్చి మన ఆరోగ్యాన్ని పాడుచేస్తాయి. నిద్ర వల్ల మనకు సంక్రమించే రోగనిరోధకశక్తి క్షీణిస్తుంది. ఈ సమస్యలు అధిగమించాలంటే రోజూ 8 గంటలు నిద్ర ఉండాలి. సెల్‌ఫోన్ వాడకం తగ్గించుకోవడంతో పాటు యోగా, మెడిటేషన్ చేసుకుంటే నిద్రలేమి సమస్య అధిగమించవచ్చు.

- నార్ని బావాజి, వైద్యుడు, తాడేపల్లిగూడెం

'ఎమ్మెల్సీగా ఆలపాటిని గెలిపించండి'

ముదినేపల్లి/మండవల్లి/ముదినేపల్లి/నూజివీడు టౌన్ ఫిబ్ర వరి 15 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల శాసన మండలి ఎన్నికల్లో ఎన్‌డీఏ కూటమి అభ్య ర్థిగా పోటీ చేస్తున్న ఆలపాటి రాజేంద్ర ప్రసాద్‌ను గెలిపించా లని తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి చలసాని జగన్మోహనరావు కోరారు. శనివారం ఆయన ముదినేపల్లిలో పట్టభద్రులను కలసి ఓట్లను అభ్యర్థించారు. కైకలూరు నియోజకవర్గ బీజేపీ కో- కన్వీనర్ అడుసుమిల్లి సాయి కృష్ణ పాల్గొన్నారు.


ఆలపాటి రాజాను గెలిపించాల్సిందిగా నూజివీడులో ప్రచారం నిర్వహిస్తున్న కొండారెడ్డి వరహరివరప్రసాద్

ఆలపాటిని గెలిపించాలంటూ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారా న్ని కైకలూరు నియోజకవర్గ టీడీపీ సమన్వయ కమిటీ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు నిర్వహించారు. పెదపాలపర్రు సర్పంచ్ గంటా రాకేష్, టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి రవికుమార్, ఉపాధ్యక్షులు రాంబాబు, నీటి సంఘం అధ్యక్షుడు కేసం ప్రసాద్ ప్రచారంలో పాల్గొన్నారు.

● మండవల్లి మండలంలోని చింతపాడు, మండవల్లి, కానుకొల్లు జడ్పీ హైస్కూల్లో కూటమి నాయకులు సజ్జా బాబీ, గజ్జల గణేష్, బోయిడి సురేష్, గుడివాడ గణేష్ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం చేస్తూ ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ కు ఓటు వేయాలని ఉపాధ్యాయులను కోరారు. రాజేష్, శ్రీరామమూర్తి, చంద్రశేఖర్ తదితరులు ప్రచారంలో పాల్గొన్నారు.

● ముదినేపల్లి మండలం బొమ్మినంపాడు, అల్లూరు, పెద గొన్నూరు, ముదినేపల్లి, పెదపాల పర్రు జడ్పీ హైస్కూళ్లలో ప్రచారంలో పాల్గొన్నారు.

● ఎమ్మెల్సీ ఎన్నికల్లో గ్రాడ్యుయేట్ యువత కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ (రాజా)కు మద్దతుగా నిలిచి గెలిపించాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ సభ్యుడు కొండారెడ్డి నరహరివరప్రసాద్ కోరారు. శనివారం నూజివీడులో రాజాకు మద్దతు కోరుతూ ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో యువతకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. రాజీను గెలిపించి పెద్దల సభకు పంపాలని కోరారు. టీడీపీ నాయకులు జగన్నాథం వాకిలయ్య, తురకా అభిలాష్, చిట్టిపోతుల కోటి పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించండి

నూజివీడు టౌన్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : సమయపాలన పాటిస్తూ విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించేందుకు మెస్ నిర్వాహకులు కృషిచేయాలని నూజివీడు ట్రిపుల్‌ఐటీ డైరెక్టర్ ఎస్.అమరేంద్రకుమార్ అన్నారు. నూజివీడు ట్రిపుల్‌ఐటీ క్యాంపస్‌లో మెస్ నిర్వాహకులు, కమిటీతో శనివారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డైనింగ్ హాల్స్, వంట ప్రాంతాలను పూర్తి పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ఏవో లక్ష్మణ్, డీన్ ఆఫ్ అకాడమిక్స్ డాక్టర్ చిరంజీవి, డీఎస్‌డబ్ల్యూ బ్రహ్మాస్వాములు, మెస్‌కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ అమరేంద్రకుమార్

ప్రభుత్వ పథకాలను వినియోగించుకోవాలి

నూజివీడు టౌన్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీలకు ప్రభుత్వాలు అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నాయని, వాటిద్వారా ప్రతిఒక్కరూ విద్య, ఆర్థికంగా బలోపేతమవుతూ ముందుకు సాగాలని నూజివీడు సీనియర్ సివిల్ జడ్జి షేక్ పెదకాశీం అన్నారు. మండల న్యాయసేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం కొత్తూరు తండాలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. చట్టప్రకారం ఎస్సీ, ఎస్టీలకు కల్పిస్తున్న రక్షణ, అట్రాసిటీ యాక్ట్ తదితరాలను వివరించారు. గ్రామ సర్పంచ్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

'మామిడి'లో తామర పురుగుల నివారణ చేపట్టాలి

నూజివీడు, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : మామిడిలో తామరపురుగుల ఉధృతిని అరికట్టేందుకు రైతులు చర్యలు చేపట్టాలని మామిడి పరిశోధనా కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త బి.కనక మహాలక్ష్మి సూచించారు. బత్తులవారిగూడెంలో తామరపురుగుల ఉధృతికి సంబంధించి మామిడి తోటలను శనివారం శాస్త్రవేత్తల బృందం పరిశీలించింది. ఆమె మాట్లాడుతూ నూజివీడు, ముసునూరు, ఆగిరిపల్లి, ఎన్టీఆర్ జిల్లా విస్సన్నపేట మండలాల్లో ప్రస్తుతం మామిడిలో తామరపురుగుల ఉధృతి కనిపిస్తోందన్నారు. నల్ల తామరపురుగుల వల్ల పూత నల్లగా మాడిపోయి, నష్టం కలగడంతో పాటు అనంతరం బూడిదతెగులు ఆశించి పంటకు తీవ్రనష్టం కలుగుతుందన్నారు. తామరపురుగుల నివారణకు స్పైనోసాడ్ లేదా ఇమిడాక్లోఫిడ్, పిప్రోనిల్‌లను కలిపి పిచికారీ చేయాలన్నారు. పిందె రాలుతున్నట్టయితే ప్లానోఫిక్స్‌ను 0.2 ఎంఎల్ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలని సూచించారు. మామిడి పరిశోధనాకేంద్రం శాస్త్రవేత్త కె.రాధారాణి, శాలీరాజ్, హెచ్‌వో హేమ పాల్గొన్నారు.

ఓటు హక్కును నిస్వార్థంగా వినియోగించుకోవాలి

నూజివీడు, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : ఓటుహక్కును నిస్వార్థంగా వినియోగించుకుని దేశ భవిష్యత్తుకు ప్రాధాన్యత ఇవ్వాలని నూజివీడు సబ్‌కలెక్టర్ స్మరణ్‌రాజ్ అన్నారు. నూజివీడు ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో ఓటుహక్కుపై సామాజిక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ దేశభవిష్యత్తును యువత భవిష్యత్తును నిర్దేశించేది ఓటుహక్కు అన్నారు. నూజివీడు తహసీల్దార్ సుబ్బారావు మాట్లాడుతూ అర్హులైన ప్రతిఒక్కరూ ఓటుహక్కును వినియోగించుకునేలా ప్రతి ఒక్కరికి తెలియజేయాలన్నారు. ఎన్నికల నిర్వహణ అంశాలను విద్యార్థులకు వివరించారు. టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ కె.వెంకటేశ్వరరావు, డీఎస్‌డబ్ల్యూ దుర్గాభవాని, చీఫ్ వార్డెన్ డాక్టర్ పీవీ లక్ష్మణరావు, డీన్ ఆఫ్ అకాడమిక్స్ రఘుకుమార్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ స్మరణ్‌రాజ్

'చెత్త నుంచి సంపద సృష్టించడమే లక్ష్యం'

ముసునూరు, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): చెత్త నుంచి సంపద సృష్టించడమే లక్ష్యమని నూజివీడు ఫీల్డ్ టెక్నికల్ కో-ఆర్డినేటర్ బి.శ్యామలరావు అన్నారు. శనివారం స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్రలో భాగంగా గ్రామ పంచాయితీల్లో ఉన్న చెత్తను సంపద కేంద్రాలను తలించారు. ముసునూరులో ఉన్న సంపద కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. సేకరించిన చెత్తను తడి, పొడి చెత్తలుగా విభజించి, వానపాముల ఎరువు తయారీకి చెత్తను వినియోగించేలా చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఉన్న సంపద కేంద్రాలను వినియోగంలోకి తీసుకువచ్చి, పంచాయతీలకు ఆదాయ వనరులను సమకూర్చేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. సేకరించిన చెత్తను సంపద కేంద్రాలకు తరలించాలని సిబ్బందికి సూచించారు. మండల స్పెషల్ ఆఫీసర్ సుందరి ఈవోపీఆర్డీ బీ.ఏ సత్యనారయణ పాల్గొన్నారు.

'విశిష్ట గుర్తింపు సంఖ్యతో అనేక ప్రయోజనాలు'

చాట్రాయి, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): విశిష్ట గుర్తింపు సంఖ్యతో రైతులకు ఎన్నో ఉపయోగాలు ఉన్నాయని ప్రతి రైతు రిజిస్టర్ చేయించుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి ఎస్‌కే హబీబ్‌బాషా అన్నారు. శనివారం నరసింహారావుపాలెం, చనుబండ రైతుసేవా కేంద్రాలను నూజివీడ వ్యవసాయ సంచాలకులు విద్యాసాగర్‌తో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేసి రైతుల విశిష్ట గుర్తింపు సంఖ్య నమోదు ప్రక్రియను సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ మండలంలో మొత్తం 6,650 మంది రైతులు ఉండగా ఇప్పటికి 3,370 రైతులను నమోదు చేశామని మిగతా రైతులు కూడా రైతుసేవా కేంద్రాలకు వచ్చి రిజిస్టర్ చేసుకోవాలని కోరారు. ఏవో శివ శంకర్, టీడీపీ నాయకుడు జక్కంపూడి ప్రదీప్, రైతులు ఉద్యోగులు పాల్గొన్నారు.

బీజేపీ ముదినేపల్లి మండల నూతన కార్యవర్గం నియామకం

ముదినేపల్లి, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): భారతీయ జనతా పార్టీ ముదినేపల్లి మండల శాఖకు నూతన కమిటీ ఏర్పాటైంది. కమిటీ అధ్యక్షురాలిగా సత్యవోలు నాగలక్ష్మీ, ఉపాధ్యక్షులుగా కొత్త పల్లి లక్ష్మీపతిరాజు, నచ్చిరెడ్డి వెంకటేశ్వర రావు, మాగుడుల పూర్ణచంద్రరావు, పసుపులేటి నరసింహారావు, టేకు కనకాచారి, నీలం మంగమ్మ, ప్రధాన కార్యదర్శులుగా కొల్లిపర నాగరాజు, నీలం మల్లేశ్వరరావు, మరో ఐదుగురు కార్యదర్శులు, కోశాధికారిగా మేలిమి చిట్టిబాబు నియమితులయ్యారు. మండల బీసీ సెల్ అధ్యక్షుడిగా మీసాల సత్యనారాయణ, మహిళా విభాగం అధ్యక్షురాలిగా రెడ్డి నాగలక్ష్మీ, యువజన విభాగం అధ్యక్షుడిగా శివరామకృష్ణ, మైనార్టీ సెల్ అధ్యక్షుడిగా షేక్ రియాజ్, కిసాన్ మోర్చా అధ్యక్షుడిగా బండారు పాండు రంగారావు, నియమితులయ్యారు. నూతన కార్యవర్గాన్ని పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోటప్రోలు కృష్ణారావు అభినందించారు.


నాగలక్ష్మి, బీజేపీ మండల అధ్యక్షురాలు

నేడు ఆలయాల హుండీల లెక్కింపు

ఆగిరిపల్లి, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): మాఘమాస ఉత్సవాల అనంతరం మండలంలోని ఆగిరిపల్లి, తోటపల్లి ఆలయాల్లో హుండీల లెక్కింపునకు గన్నవరం తనిఖీ అధికారి అనురాధ పర్యవేక్షణలో జరుగునని ఈవో సీహెచ్. సాయి తెలిపారు. సోమవారం ఉదయం పది గంటలకు తోటపల్లిలోని దుగ్గిరాల బాలరావమ్మతల్లి ఆలయంలో హుండీలు లెక్కింపు జరుగుతుంది. మధ్యాహ్నం రెండు గంటలకు ఆగిరిపల్లి శోభనాచలస్వామి ఆలయంలో హుండీల లెక్కింపు జరుగుతుందన్నారు. హుండీల లెక్కింపునకు ఆసక్తిగల వారు పాల్గొనవచ్చని తెలిపారు.



కైకలూరులో స్వచ్ఛ దివస్‌పై ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు



కలిదిండిలో ర్యాలీ నిర్వహిస్తున్న పంచాయతీ అధికారులు


ఆగిరిపల్లి స్టేషన్ ఆవరణలో శుభ్రం చేస్తున్న ఎస్ఐ శుభశేఖర్

'పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి'

కైకలూరు/కలిదిండి/ముదినేపల్లి, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : పరిశుభ్రమైన వాతావరణం తోనే ప్రజలకు ఆరోగ్య సమస్యలు ఉండవని కైకలూరు ఎంపీడీవో ఫణీంద్ర అన్నారు. కైకలూరులో స్వచ్ఛాంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. గ్రామాల్లో ఎక్కడా చెత్తా చెదారం లేకుండా సర్పంచ్‌లు, కార్యదర్శులు, అన్నిశాఖల అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. పట్టణంలో స్వచ్ఛదివస్ ర్యాలీ నిర్వహించారు. ప్రజలతో కలిసి ప్రతిజ్ఞ చేశారు. ఇన్‌చార్జి తహసీల్దార్ ఎండీ ఇబ్రహీం, కార్యదర్శి ఆనంద భూషణం, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. కలిదిండిలో శనివారం పంచాయతీ అధికారులు స్వచ్ఛాంధ్ర - స్వచ్ఛదివస్ అవగాహన ర్యాలీ నిర్వహించారు. రోడ్లపై చెత్తకుప్పలు లేకుండా పరిశుభ్రంగా ఉండేలా ప్రజ లు సహకరించాలన్నారు. ఎంపీడీవో కొండ లరావు, కార్యదర్శులు, పారిశుధ్య సిబ్బంది పాల్గొన్నారు. స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని ముదినేపల్లి మండలంలోని అన్ని గ్రామాల్లో నిర్వహించారు. తహసీల్దార్ సుభానీ, మండల పరిషత్ కార్యాలయ ఏవో రమణారావు, పంచాయతీ కార్యదర్శి రమేష్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో హైస్కూలు ఉపాధ్యా యులు, విద్యార్థులు పాల్గొని వీధులను శుభ్రం చేశారు. పెయ్యేరులో ఏపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి బేతాళ రాజేంద్ర ప్రసాద్ ఆధ్వర్యంలో విద్యార్థు లు స్వచ్ఛ దివస్ ప్రతిజ్ఞ చేశారు. ముదినేపల్లి ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ సత్యనారాయణ ఆధ్వర్యంలో విద్యార్థులు పరిశుభ్రత పనులు నిర్వహించారు.

నూజివీడు నియోజకవర్గంలో..

● ఆగిరిపల్లి/చాట్రాయి/నూజివీడు టౌన్ : పరిసరాల పరిశుభ్రం అందరి బాధ్యత అని ఇన్‌చార్జి ఎంపీడీవో ఆనంద్‌బాబు అన్నారు. ఆగిరిపల్లి మండ లంలోని అన్ని గ్రామాల్లో స్వచ్ఛాంధ్ర- స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. వట్టిగు డిపాడు పంచాయతీ పరిధిలో రోడ్లపై ఉన్న చెత్తను ఎత్తి శుభ్రం చేశారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఎస్ఐ శుభశేఖర్ అన్నారు. కార్యక్రమంలో భాగంగా స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో ఉన్న చెత్తను సిబ్బందితో కలిసి ఆయన తొలగించారు. చాట్రాయిలో స్వచ్ఛాంధ్ర- స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా నూజివీడు డీఎల్‌డీవో, మండల స్పెషలాఫీసర్ వెంకటరత్నం, ఎంపీడీవో విజయలక్ష్మి ఆధ్వర్యంలో అధికారులు, సిబ్బంది సచివాలయం, వీధులు శుభ్రం చేసి వ్యాపారుల నుంచి తడి, పొడిచెత్త సేకరించి పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. జడ్పీ హైస్కూల్‌లో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాఠశాల ఆవరణ శుభ్రం చేసి ప్రతిజ్ఞ చేశారు. సీహెచ్‌వో రమణ, పంచాయతీ కార్యదర్శి నాగరాజు, సర్వేయర్ లక్ష్మీనారాయణ, వెల్ఫేర్ అసిస్టెంట్ నాగేశ్వరరావు పాల్గొన్నారు. ప్రతి ఒక్కరూ పరిశుభ్ర ఆంధ్రప్రదేశ్ సాధన దిశగా అడుగువేయాలని ఎక్సైజ్, ప్రొహి బిషన్ సీఐ ఎ.మస్తానయ్య అన్నారు. నూజివీడు ప్రొహిబిషన్ ఎక్సైజ్‌స్టేషన్ కార్యాలయంలో పరిశుభ్ర ఆంధ్రప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా కార్యాలయ ప్రాంగణాలను శుభ్రపరిచారు. ఎక్సైజ్ ప్రొహిబిషన్‌శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ఓటుహక్కుపై అవగాహన ర్యాలీ

ముసునూరు, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని తహసీల్దార్ కె.రాజ్‌కుమార్ అన్నారు. సిప్ ప్రోగ్రామ్‌లో భాగంగా ఓటు ప్రాధాన్యతపై ముసునూరులో రెవెన్యూ అధికారులు, సిబ్బంది, విద్యార్థులు సంయుక్తంగా అవగాహన ర్యాలీ శనివారం నిర్వహించి, ప్రతిజ్ఞ చేశారు. తహసీల్దార్ మాట్లాడుతూ అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ నూతనంగా ఓటు నమోదు చేసుకోవాలన్నారు. ర్యాలీలో ఈవోపీఆర్డీ బీఏ సత్యనారయణ, బి.శ్యామలరావు, వీఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.

తొమ్మిది మంది జూదరుల అరెస్ట్

నూజివీడు టౌన్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): నూజివీడు మండలం మొర్సపూడిలో పేకాట శిబిరంపై దాడి చేసి తొమ్మిది మందిని అరెస్ట్ చేశామని రూరల్ ఎస్ఐ ఎస్.లక్ష్మణ్‌బాబు తెలిపారు. శనివారం జరిపిన దాడిలో వారి వద్ద నుంచి రూ.23,840 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. కోడిపందేలు, పేకాట శిబిరాలు నిర్వహిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	110, 119, 130
చికెన్ విత్ స్కిన్	210
చికెన్ స్కిన్‌లెస్	220

నెక్ కోడి గుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ.475